# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 సంచిక - 177 హైదరాబాద్ శనివారం 03-01-2026 పేజీలు : 12 వెల : 1.00


11లో

ఏపీ నెంబర్ వన్ అంటూ 'ఫోర్బ్స్' కథనం... మంత్రి నారా లోకేశ్ స్పందన

# మూసీకి మహర్దశ..

## రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం


11లో



11లో

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో హాల్ టిక్కెట్లు

- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం


11లో

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..

- స్తంభించిన ట్రాఫిక్
- ముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డ డ్రైవర్లు
- శంషాబాద్ హైవేపై 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్
- విజయవాడ జాతీయ రహదారిపై లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు

## అమరావతి నిర్మాణ పనుల్లో మరో కీలక అడుగు..

- పంపింగ్ స్టేషన్-2 పనులకు టెండర్ల ఖరారు!
- ఉండవల్లి వద్ద పంపింగ్ స్టేషన్-2 నిర్మాణం
- మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాకు నిర్మాణ పనుల అప్పగింత
- రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ఉండటమే ప్రాజెక్టు లక్ష్యం


11లో


11లో

## తిరుమలలో భక్తుల కోసం టీటీడీ సరికొత్త ఆలోచన

- వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మూడు రోజుల్లో 1.77 లక్షల మందికి శ్రీవారి దర్శనం
- తిరుమల హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం
- భక్తుల కోసం వీపున వాటర్ క్యాన్లతో టీటీడీ సేవలు
- ప్రాణదాన ట్రస్టుకు చెన్నై భక్తుడి రూ.50 లక్షల విరాళం


11లో

## తెలంగాణ శాసనసభలో గందరగోళం..

- హరీశ్ రావు సూచనను తిరస్కరించిన స్పీకర్
- అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- రైతులకు యూరియా అందడం లేదంటూ ప్రభుత్వంపై విమర్శలు
- యూరియా అంశంపై పాయింట్ ఆఫ్ ఆర్డర్ కోరిన హరీశ్

## జి.హెచ్.ఎం.సి మహా నగరం.. సవాళ్ల సంద్రం!

- 27 మున్సిపాలిటీల విలీనంతో 'గ్రేటర్' విస్తరణ.. కానీ నిధులు, నియామకాల్లో నిమ్మకు నీరెత్తిన చందమే!
- వారసత్వ సమస్యలతో సతమతమవుతున్న పాలన.. సిబ్బంది కొరతతో కునారిల్లుతున్న సేవలు.
- (పరిశోధనాత్మక పాత్రికేయం మీ.. "వీ.జీ" (ఎం వేణుగోపాల్ రెడ్డి)

12లో





11లో

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ..

### తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన కీలక నేత

- డీజీపీ ఎదుట లొంగిపోయిన మావో నేత బర్సే దేవా
- హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోలకు భారీ ఎదురుదెబ్బ
- హిడ్మా, బర్సేలది ఒకే గ్రామం

# రసవత్తరంగా బెంగాల్ రాజకీయం

పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం ఒక నిర్ణయాత్మక రాజకీయ పర్వంలో ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమవుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 2011లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించినన తర్వాత తొలిసారిగా రాష్ట్ర రాజకీయ వాతావరణం కాస్త గందరగోళంగా, అస్థిరంగా ఉంది. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఎదురులేదు. ఆమె వ్యక్తిత్వం, మార్పు తీసుకువస్తానన్న ఆమె వాగ్దానం చుట్టూ తిరిగిన రాజకీయ కథనం ప్రస్తుతం మరింత గందరగోళాన్ని ప్రతిబింబిస్తోంది. 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఎంసి సర్కార్‌కు ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగానే ఉంది. ఇక బిజెపి రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దాదాపు కనుమరుగైన స్థితినుంచి వామపక్షాలు కోలుకుని కాస్త తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక కోల్‌కతా సివిల్ పోల్స్ ఫలితాలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షోలు సంస్థాగత జోక్యం, రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో మారుతున్న రాజకీయ సెంటిమెంట్లు రాబోయే ఎన్నికల ఫలితాలు 2021 మాదిరిగా ఉండబోవని సూచిస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో రాజకీయచిత్రం మారవచ్చు. త్రిముఖ పోటీలే ఉండవచ్చు. ప్రతి పార్టీ మరో పార్టీతోనే కాక, సొంత పార్టీలో తిరుగుబాటుదారులతో గట్టి పోటీ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చు. 15 ఏళ్ల పాలన ప్రభుత్వ వ్యతిరేకతనే కాదు పాలకులకు అలసటను కూడా తెస్తుంది. ప్రభుత్వ నియామకాల్లో అవినీతి ఆరోపణలు, స్థానిక విద్యుత్ బ్రోకర్లపై పెరుగుతున్న ఆగ్రహం, సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీలో రాజకీయ జోక్యంపై ఆందోళనలు ఉండనే ఉన్నాయి. ఒకప్పుడు భావోద్వేగశక్తిగా, విప్లవాత్మకంగా భావించిన మా మాటీ –మనుష్ కథనం ఆరోపణలకు కేంద్రంగా మారింది. అధికార వికేంద్రీకరణ వల్ల కొన్ని చోట్ల నియంత్రణ మరింత కఠినంగా మారింది. అయినా, బెంగాల్‌లో ప్రభుత్వ వ్యతిరేకత అంత తీవ్ర స్థాయిలో లేదు. వ్యవస్థపై అసంతృప్తి ఉన్నా, మమతా బెనర్జీని తిరస్కరించే అంతగా మారలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా మమతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్మీ భండార్, కన్యశ్రీ, స్వాస్థ్యా సతి, రూపశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆమెకు వ్యక్తిగతంగా తిరిగి అధికారం అందించే గ్యారంటీగా నిలుస్తున్నాయి. బెంగాల్‌లో ఉన్న సెంటిమెంట్ ప్రభుత్వంలో మార్పును డిమాండ్ చేసే స్థాయిలో లేదు. టిఎంసి ప్రభుత్వం స్థానిక నాయకత్వంపై వస్తున్న ఆరోపణలను చక్కదిద్ది, సజావుగా సంక్షేమం అందేటట్లు చూడగలమని ఒప్పించాలి. ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. మమతా బెనర్జీ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించి, అధికారం తిరిగి చేజిక్కించుకునేందుకు తగిన విధంగా మార్చగలరా అన్నదే అధికార పార్టీ ఎదుర్కొంటున్న ప్రశ్న. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సంక్లిష్టతకు తగిన సమాధానం దొరికింది. టిఎంసి విజయం సాధించి మహా నగరంపై తన నియంత్రణ నిలుపుకుంది. పాలక పార్టీకి ప్రస్తుతానికి ముఖ్యమైన ఆధిక్యత లభించింది. కోల్‌కతా కేవలం ఓ నగరం కాదు. రాజకీయంగా బలమైన ఘనమైన అడ్డా. దానిని నిలుపుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో విమర్శలు, ఎన్నికలలో ఓటర్ల మద్దతు తగ్గుతుందన్న వాదనలో అర్థం లేదనే ప్రభుత్వ ధీమాకు బలం చేకూరింది. బిజెపికి సంబంధించినంత వరకూ స్థానిక ఎన్నికలు ఆ పార్టీ సంస్థాగత లోపాలను బయటపెట్టాయి. గత పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ దీటైన బలాన్ని ప్రదర్శించినా, నగర రాజకీయాల యంత్రాంగంలో తనను మమేకమైపోయేందుకు చేస్తున్న కృషిలో అది చాలా కష్టపడింది. వార్డు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం కాకపోవడం అభ్యర్థుల ఎంపికలో లోపాల వల్ల బిజెపి చెప్పినంత బలంగా తనను తాను నిరూపించుకోలేకపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే పర్యటనలు, రోడ్ షోలు, ఘనమైన ప్రసంగాలు, ఈ లోపాన్ని సవరించడమే లక్ష్యంగా పెట్టుకుని సాగాయి. బెంగాల్‌ను కైవసం చేసుకోవడం తమ పరిధికి మించిన పనిగా అంగీకరించేందుకు బిజెపి ఇష్టపడడం లేదని ఆయన ఉనికి సూచిస్తోంది. ఈ రోడ్ షో వల్ల రెండు ప్రయోజనాలు. అవి పార్టీ కేడర్‌ను ఉత్తేజపరుస్తాయి. కేంద్ర నాయకత్వం తమకు రాష్ట్రంలో అండగా ఉందని మద్దతుదారులకు భరోసా కల్పిస్తాయి. అయినా, రాష్ట్రంలో నమ్మకమైన నాయకత్వం నిర్మాణంలో, అంతర్గత వర్గ వివాదాలు, అస్థిరతను చక్కదిద్దడంలో ఇటువంటి ప్రయోగాలు ఏమాత్రం పనిచేస్తాయనే ప్రశ్న మిగిలే ఉంది. బిజెపి ప్రచారం ఎక్కువగా శాంతి భద్రతలు పరిరక్షణ, రాజకీయ హింసను నిర్మూలన, సుస్థిరమైన పాలన వంటి వాగ్దానాలకే పరిమితమైంది. అయితే, దానిని విజయం అది ఏ మేరకు బెంగాల్ నిర్దుష్ట మోడల్ పాలన అందించగలదనే అంశంపైనే ఆధారపడి ఉంది. మరో పక్క, లెఫ్ట్‌ఫ్రంట్ ఆచీతూచి అడుగులు వేస్తూ తన బలాన్ని పెంచుకునే స్థితిలో ఉంది. దీనిని పునరుజ్జీవనం గా అనలేం కానీ, పూర్తిగా తోసిపుచ్చలేం. కోల్‌కతా, అనేక జిల్లాలలో లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్ల షేర్ మెరుగైంది. టిఎంసి, బిజెపి రెండింటి పట్ల భ్రమలు కోల్పోయిన ఒక వర్గం పాలక పక్షానికి ప్రత్యామ్నాయంగా కాకుండా రాజకీయ శూన్యం భర్తీ చేసేదిగా వామపక్షం వైపు చూస్తోంది. చాలామంది యువకులు, యువ ఓటర్లు, ముఖ్యంగా విద్యార్థులు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు వామపక్షాల వైపు మొగ్గుచూపుతున్నారు. వామపక్షం పాలనలో నిబద్ధతతో పని చేసిన పాలనా వ్యవస్థలను జ్ఞప్తి చేసుకుంటున్నారు. వామపక్షాలు గతంపై ఆధారపడకుండా, నిరుద్యోగం, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఆందోళనలను ఎదుర్కొంటున్న ఈ తరానికి తమ పాలన ఎలా ఉంటుందో వ్యక్తపరచి, నచ్చచెప్పడం, సందర్భోచితంగా మారడం అవసరం. 2026 ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభంజనం వచ్చే అవకాశం లేనందున, సంప్రదింపులే కీలకం కాగలవు. సంఖ్యాపరంగా, సంస్థాగత కోణంలోనే కాక, పాలనాపరంగా టిఎంసి అధికారం వల్ల సంక్రమించిన ప్రయోజనాన్ని నిలుపుకుంటుంది. మమతా బెనర్జీ వ్యక్తిగత చరిష్మా, వ్యక్తిగతంగా ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నాయకత్వం, సంక్షేమ పథకాలు ఆ పార్టీకి కొండంత బలం. బిజెపికి కేంద్రంలో జాతీయ స్థాయిలో అధికారం వల్ల ప్రయోజనం. ఎన్నికలను ఓ సైద్ధాంతిక పోరుగా మార్చే సామర్థ్యం, సమృద్ధిగా ఆర్థిక పరమైన వనరులు, మార్పు తీసుకు వస్తామని చేస్తున్న వాగ్దానం, ప్రజలను ఒప్పించే సామర్థ్యం అండగా నిలవవచ్చు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పరమైన వాదన కన్నా, నైతికపరమైన భరోసా కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. రాజకీయంగా తెరమరుగయ్యారని భావించే ఓటర్లకు, తక్షణ విజయం కోసం కాకపోయినా, ఆ రెండు పక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేయాలనుకునే వారికి తగిన ప్రత్యామ్నాయంగా నిలిచే అవకాశం ఉంది. బెంగాల్ ఓటర్లు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బెంగాల్ లో రాజకీయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఎవరు ఎవరిని ఓడించగలరు అని కాదు. ఎవరు విశ్వసనీయమైన పాలన అందించగలరు అన్నదే. టిఎంసి ఓటర్లను గతంలో మాదిరిగానే ఆదరించమని అడుగుతోంది. బిజెపి తమను ప్రత్యామ్నాయంగా భావించి ఓటర్లు రిస్క్ తీసుకోవాలని కోరుతున్నాయి. ఇక వామపక్షాలు తమను కూడా మరో ప్రత్యామ్నాయంగా చూడాలని అడుగుతున్నాయి. ఈ ప్రతిపాదనలు ఏవీ విజయానికి హామీ ఇవ్వవు. సాధారణ రాజకీయాల విభిన్న దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. పశ్చిమ బెంగాల్ ఈ ఎన్నికల్లో రెండు వ్యక్తిత్వాలలో దేనివైపు మొగ్గుచూపాలనే రాష్ట్రంగా కాక, సొంత రాజకీయ భవిష్యత్ కోసం చర్చిస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నది. ప్రజలలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలు ఎలా ఉన్నాయంటే, 2026 తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయి. 15 ఏళ్లగా పాతుకుపోయిన సర్కార్‌ను కూల్చివేసి, కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తే, వచ్చే ఐదేళ్లు ఆ క్రమం పరిణతి చెందుతుందా, మార్పు సాధ్యమవుతుందా, కొత్త దశ పోటీకి దారితీస్తుందా అనే గురించి కూడా కావచ్చు. కౌంట్ డౌన్ మొదలైంది. 2026లో ప్రజలు ఇచ్చే తీర్పు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెడుతుందని కాక, బెంగాల్ ఏ పాలనా దృక్పథాన్ని విశ్వసించేందుకు సిద్ధంగా ఉందో వెల్లడిస్తుంది.

# ఏపీలో కొత్తగా నాలుగు విద్యుత్ ప్లాంట్లు

నెల్లూరు జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యకు చెక్ పెట్టేస్తోంది! రాష్ట్రంలో కొత్తగా నాలుగు చోట్ల చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు రానున్నాయి. విశాఖ, గుంటూరు తర్వాత



ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ ప్లాంట్లు కొలువుదీరనున్నాయి. దీనితో పర్యావరణానికి మేలుతో పాటు, విద్యుత్ అవసరాలు తీరనున్నాయి. ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై డిస్కంల అధికారులు, ప్లాంట్ల నిర్వాహకులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు ఘన వ్యర్థాల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనుగోలు చేస్తాయి. దీనివల్ల రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణతో పాటు విద్యుత్ ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులలో ఇప్పటికే ఇలాంటి ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో కొత్త ప్లాంట్లు రానున్నాయి. ఈ ప్లాంట్లు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. ఈ కొత్త ప్లాంట్లు పూర్తయితే, రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలను విద్యుత్తుగా మార్చవచ్చు. ఇది పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది. వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం అనేది ఒక ఆధునిక పద్ధతి. దీనివల్ల చెత్తను పారవేయడం సులభం అవుతుంది. అలాగే, కరెంటు కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రక్రియలో, వ్యర్థాలను కాల్చి లేదా ఇతర పద్ధతుల ద్వారా వేడి చేసి, ఆ వేడితో టర్బైన్లను తిప్పి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. 'వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని కూడా సమకూర్చవచ్చు' అన్నారు మంత్రి నారాయణఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.. డిస్కంలు, ప్లాంట్ల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలి' అన్నారు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న నాలుగు కొత్త ప్లాంట్లకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి వచ్చే 7,500 టన్నుల వ్యర్థాలలో 7,000 టన్నులు ఈ ప్లాంట్లకు వెళ్తాయన్నారు. మిగిలిన 500 టన్నుల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ ప్లాంట్ల నిర్మాణం వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని.. మార్కెట్ వ్యర్థాల నిర్వహణకు ఏడు ప్లాంట్లు, విశాఖ, విజయవాడ, తిరుపతిలో మూడు ఈ-వేస్ట్ ప్లాంట్లు, మరో మూడుచోట్ల చికెన్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.ఈ కొత్త విద్యుత్ ప్లాంట్లు వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. దీనివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ ప్లాంట్లు పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరడంతో పాటు, వ్యర్థాల నిర్వహణ సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఈ-వేస్ట్ ప్లాంట్లు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయడానికి ఉపయోగపడతాయి. చికెన్ వేస్ట్ ప్లాంట్లు మాంసం వ్యర్థాలను ఉపయోగించుకుంటాయి. ఈ విధంగా, రాష్ట్రం వ్యర్థాల నిర్వహణలో ఒక ముందడుగు వేస్తోంది.

# అడ్డంగా బుక్కైన ఎమ్మెల్యే

తిరుపతి జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజకీయాల్లో కలకలం రేపిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఏడాది కాలంగా మిస్టరీగా, రాజకీయ ఆరోపణల నడుమ సాగుతున్న ఈ కేసు విచారణలో చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. ఈ హత్యతో సంబంధం ఉందన్న అనుమానాలు, మృతుడి వీడియో వాంగ్మూలం ఆధారంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని విచారించేందుకు చెన్నై పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం ఖాయంగా కనిపిస్తోంది.ఈ కేసులో ప్రాథమికంగా జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబులను నిందితులుగా భావించినప్పటికీ, మృతుడు రాయుడు చనిపోవడానికి ముందు చిత్రీకరించిన ఒక వీడియో ఇప్పుడు విచారణను మరో మలుపు తిప్పింది. సుమారు 19.42 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో రాయుడు సంచలన విషయాలను వెల్లడించారు. తనను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రలోభపెట్టారని, తన అనుచరుడు సుజిత్‌రెడ్డి ద్వారా సంప్రదింపులు జరిపారని రాయుడు ఆ వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా కోట దంపతులను రోడ్డు ప్రమాదంలో అంతమొందించాలని తనపై ఒత్తిడి తెచ్చినట్లు రాయుడు చెప్పడం గమనార్హం. ఈ వీడియోనే ఇప్పుడు ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.గతంలో ఈ కేసులో అరెస్టయిన కోట వినుత, చంద్రబాబులు మొదటి నుంచి తాము నిర్దోషులమని వాదిస్తూనే ఉన్నారు. రాయుడు హత్యలో తమ ప్రమేయం లేదని, ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా తమను ఇరికించే ప్రయత్నమని వారు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్యే బొజ్జల హస్తం ఉందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇప్పుడు రాయుడి వీడియో బయటకు రావడం, అందులో బొజ్జల పేరు ప్రస్తావనకు రావడంతో కోట దంపతుల వాదనకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే కోట దంపతుల వాంగ్మూలాన్ని, రాయుడి వీడియోను సాంకేతిక ఆధారంగా తీసుకుని చెన్నై పోలీసులు ఎమ్మెల్యేను విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు గతేడాది జులై 7న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జులై 7న అదృశ్యమైన రాయుడి మృతదేహం మరుసటి రోజు చెన్నైలోని కూవం నదిలో తేలింది. అప్పట్లో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కేసు నమోదు చేసిన చెన్నై పోలీసులు దర్యాప్తు చేపట్టి కోట వినుత దంపతులతో పాటు వారి అనుచరులు గోపి, కారు డ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్య కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందన్న అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఇటీవల జనసేనకే చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం, రాయుడి వీడియో, కోట దంపతుల ఆరోపణలన్నింటినీ క్రోడీకరించుకున్న చెన్నై పోలీసులు.. తదుపరి చర్యగా ఎమ్మెల్యే బొజ్జలకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. అయితే, బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఈ ఆరోపణలను గతంలోనే ఖండించారు. రాయుడి హత్యతో



తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, సాక్షాధారాలు వేరేలా ఉండటంతో పోలీసుల చర్య ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.ఒక కార్యకర్త హత్య కేసులో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే విచారణకు హాజరు కావాల్సి రావడం రాజకీయంగా ఆయనకు ఇబ్బందికర పరిణామమే. ఒకవేళ రాయుడు వీడియోలో పేర్కొన్నట్లుగా.. కోట దంపతుల హత్యకు కుట్ర జరిగిందని రుజువైతే, ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. ఇది కేవలం హత్య కేసుగానే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించేందుకు జరిగిన కుట్రగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో చెన్నై పోలీసుల విచారణలో ఇంకెన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.

# 4న భోగాపురంనుంచి ట్రయిల్ రన్

విజయనగరం, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కాబోతోంది. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వాసులు ఎదురుచూస్తున్న కల సాకారం అయ్యే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమవుతున్న 'జీఎంఆర్ విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం' ట్రయల్ రన్ కు సిద్ధమవుతోంది. దీన్ని భోగాపురం ప్రాంతంలో నిర్మించడంతో అందరూ దీన్ని భోగాపురం ఎయిర్ పోర్టుగా పిలుస్తున్నారు. అయితే దీనికి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 4న ఈ విమానాశ్రయం నుంచి తొలి టెస్ట్ ఫ్లైట్ ఎగరనుంది. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు.. అది ఉత్తరాంధ్ర ప్రగతికి నాంది ప్రస్తావన.జనవరి 4వ తేదీన భోగాపురం రన్‌వే పై తొలి విమానం దిగనుందని నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రకటించింది. ఈ అద్భుత ఘట్టాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. ఈ ట్రయల్ రన్ ద్వారా రన్‌వే నాణ్యత, సిగ్నలింగ్ వ్యవస్థ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును పరిశీలిస్తారు. ఇది విజయవంతమైతే, అతి త్వరలోనే పూర్తిస్థాయి వాణిజ్య విమానయాన సేవలు ప్రారంభమవుతాయి. 2026 మే నుంచి ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలనేది ప్రభుత్వ లక్ష్యంప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం నేవీ ఆధీనంలో ఉండటం వల్ల అనేక పరిమితులు ఉన్నాయి. కానీ, భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్. సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. తొలి దశలో ఏటా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో ఇది అందుబాటులోకి వస్తోంది. భవిష్యత్తులో దీనిని ఏటా 40 మిలియన్ల ప్రయాణికుల సామర్థ్యానికి పెంచేలా డిజైన్ చేశారు. ఇందులో నిర్మించిన 3800 కిలోమీటర్ల రన్‌వే ప్రపంచంలోనే అతిపెద్ద విమానమైన ఎయిర్‌బస్ ౦380 వంటి వాటిని కూడా దించేందుకు అనుకూలంగా ఉంటుంది. కేవలం ప్రయాణికులే కాదు, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల కోసం భారీ కార్గో టెర్మినల్ కూడా ఇక్కడ సిద్ధమవుతోంది.భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, అది ఆర్థిక వృద్ధికి ఇంజిన్ లాంటిది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇది ముఖద్వారంగా మారుతుంది. ఫార్మా, ఐటీ, సీ-ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలకు అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగి, పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. అరకు లోయ, విశాఖ బీచ్‌లు, శ్రీకాకుళంలోని పురాతన ఆలయాలకు విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుంది. ఎయిర్ పోర్ట్ అనుబంధంగా ఏరో సిటీ, హోటళ్లు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెంది వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. ఇన్నాళ్లూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలపై ఆధారపడిన కార్గో రవాణా, ఇకపై నేరుగా విశాఖ నుంచే జరిగే ఆస్కారం ఉంది. ముఖ్యంగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాలు, 24/7 ఆపరేషన్స్ అందుబాటులో ఉండటం వల్ల అంతర్జాతీయ విమానయాన సంస్థలు భోగాపురం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టు వేగవంతం కావడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాత్ర కీలకం. పిన్న వయసులోనే కేంద్ర విమానయాన శాఖ బాధ్యతలు చేపట్టిన ఆయన, తన సొంత ప్రాంతమైన ఉత్తరాంధ్రలో ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికి విమానం రావడం ఒక చారిత్రక ఘట్టంగా మారనుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరయ్యే అవకాశముంది. కొత్త ఏడాది మొదట్లోనే విమానం రూపంలో వచ్చిన శుభవార్త ఉ




త్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారుఈ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో ప్రారంభమైతే ఉత్తరాంధ్ర ప్రపంచంతో నేరుగా అనుసంధానమవుతుందని అంచనా. పరిశ్రమలు, వ్యాపారం, పర్యాటకం, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాతో పాటు సమీప ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలక మలుపు అవుతుందని విశ్వాసం వ్యక్తమవుతోంది. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర భవిష్యత్తును కొత్త దిశలో నడిపించబోతోందన్న నమ్మకం ప్రజల్లో బలంగా కనిపిస్తోంది.ఢిల్లీ స్థాయిలో అనుమతులు త్వరగా మంజూరు చేయించడం, నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించడం, అడ్డంకులను తొలగించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపించారు. విమానయానం సామాన్యుడికి చేరువ కావాలనే ఆయన లక్ష్యానికి భోగాపురం ఒక బలమైన పునాదిగా నిలవనుంది.మొత్తంగా, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం. జనవరి 4న జరగబోయే టెస్ట్ ఫ్లైట్ ఆ ప్రాంత అభివృద్ధికి సంకేతం. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే, ఉత్తరాంధ్ర రూపురేఖలే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులు కూడా సానుకూలంగా మారుతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

# వైసీపీకి మరో తలనొప్పి

ఏలూరు, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)



వైఎస్ఆర్‌సీపీకి దేవుడే దిక్కయ్యాడు. అది కూడా హిందూ దేవుళ్లే దిక్కయ్యారు. ఎందుకంటే రాజకీయాలు చేయడానికి. ఎక్కడ ఏ చిన్న అంశం జరిగినా పెద్దవివాదం చేసేందుకు వచ్చేస్తున్నారు. ఆ వివాదంతో హిందువుల్ని తమ వైపు తిప్పుకోవాలని అనుకుంటున్నారేమో కానీ.. వారు దేవుడితో చేస్తున్న రాజకీయమే హైలెట్ అవుతోంది. ఓ క్రిస్టియన్ నేతృత్వంలో ఉన్న పార్టీ హిందువుల్ని.. హిందూ దేవుళ్లను చులకన చేయాలని చూస్తోందన్న ఆరోపణలకు కారణం అవుతోంది. కానీ వైసీపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని గుర్తించలేక తమ గుడ్డెద్దు చేలో పడిన తరహా రాజకీయాలు తాము చేసుకుటూ పోతున్నారు. మనుషుల్లో రకరకాల మనస్థత్వాలు ఉన్న వారు ఉంటారు. కోపంతో..కసితో..కక్షతో తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలు చేసేవారు ఉంటారు. అలాంటి వాడొకడు..ద్రాక్షామంలో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. ఓ పూజారిపై కోపంతో .. ఆ శివలింగాన్నిఆ పూజారి రోజూ పూజలు చేస్తాడన్న కారణంతో ఆ శివలింగాన్ని ధ్వంసం చేశాడు. అతను కూడా శివభక్తుడే .కానీ ద్వేషంతో అతని కళ్లు మూసుకుపోయి ఘోరం చేశాడు. దానికి అతను శిక్ష అనుభవిస్తాడు. కానీ ఈ ఘటనతో రాజకీయం చేయాలనుకున్న వైసీపీ .. అంత కంటే పెద్ద తప్పిదం చేసింది. దేవుడికి జరగాల్సిన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీన్ని రాజకీయం చేయాలనుకుంది. హిందూ దేవుళ్ల విషయంలో వైసీపీ ఎలాంటి జోక్యం చేసుకున్నా అది ఆ పార్టీకి పెను సమస్యగా మారుతుంది. ఆపార్టీ బ్యాక్ గ్రౌండ్ అలాంటిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో టీటీడీని ఎంత భ్రష్టుపట్టించారో మరో ఇరవై ఏళ్ల వరకూ హిందువులు మర్చిపోయారు. ఉద్ధృతంగా సాగిన మత మార్పిళ్లకు జగన్ ప్రభుత్వం ఎలా సహకరించిందో కూడా మర్చిపోరు. వైసీపీ నేతల్లో చాలా మంది హిందువులు ఉంటారు. దేవుడిపై అమితమైన భక్తిని చూపిస్తూ ఉంటారు. కానీ వారే దేవుడిని దోపిడీ చేశారు. హిందూత్వాన్ని కించపరిచారు. ఇలాంటివన్నీ ప్రజల ముందు ఉన్నాయి. వైసీపీ నేతలు ఇప్పుడు తాము హిందూత్వాన్ని కాపాడుతామని.. కూటమి ప్రభుత్వంలో ఏదో జరిగిపోతుదంని వస్తే ప్రజలు నమ్మరు. ఏమైనా చేసినా అది వైసీపీ నేతలే చేసి ఉంటారని అనుమానిస్తారు. వారి ఇమేజ్ అలాంటిది. వైసీపీ నేతలు దేవుడ్ని నమ్ముకోవాలి. ఏ దేవుడ్ని నమ్ముతారో ఆ దేవుడిక్ ప్రార్థనలు చేయాలి. పూజలు చేయాలి. కానీ రాజకీయం చేయకూడదు. వివాదాలు సృష్టించి రాజకీయం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికే వారు దేవుడికి చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. కర్మప్రకారం శిక్షలు అనుభవించాల్సిందే. ఆ శిక్షలు అనుభవిస్తున్నారు కూడా. అందుకే.. ఇప్పటికైనా తెలుసుకుని వైసీపీ నేతలు.. దేవుడిపై కుట్రలు చేయడం.. సంబంధం లేని అంశాలతో హిందూత్వాన్ని కించపరిచేలా చేయడం మానుకుంటే.. దేవుడి ఆగ్రహానికి గురి కాకుండా ఉంటారన్న సలహాలు సొంత పార్టీ నుంచే వస్తున్నాయి

======================

# కనిపించని పవన్ మార్క్..

విజయవాడ, జనవరి 2,(భారత శక్తి ప్రతినిధి)



ఏపీలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే ఏడాదిన్నర దాటింది. జనవరి నాటికి దాదాపు 19 నెలలు పూర్తవుతాయి. ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల అధికార కాలంలో మూడో వంతు కాలం గడిచిపోతుండటంతో, ప్రభుత్వ పనితీరుపై సహజంగానే చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వ పనితీరు ఒక వైపు అయితే, కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ పాత్ర మరో ముఖ్య అంశంగా మారింది. కూటమిలో పెద్దన్న పాత్రను టీడీపీ సమర్థంగా నిర్వహిస్తోందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి నాయకుడిగా ఉన్నందున, పాలనలో టీడీపీ మాటే ఎక్కువగా నడుస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. పేరు మాత్రం కూటమి ప్రభుత్వం అయినా, వాస్తవంగా నిర్ణయాలన్నీ టీడీపీ నుంచే వస్తున్నాయన్న భావన ప్రజల్లో ఉంది. పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాత్రపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. 2024 ఎన్నికల ముందు ఆయన రాజకీయ ప్రస్థానం చాలా ఉత్సాహాన్ని కలిగించింది. అయితే ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఆయన ప్రభావం ఎంత వరకు కనిపిస్తోంది అన్నది ప్రశ్నగా మారింది. డిప్యూటీ సీఎం హోదాతో పాటు కీలక శాఖలు ఆయన వద్ద ఉన్నప్పటికీ, విధానపరమైన నిర్ణయాల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రోటోకాల్ పరంగా చూస్తే పవన్‌కు ముఖ్యమంత్రి స్థాయి గౌరవం ఉంది. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం తర్వాత ఆయన ఫొటో దర్శనమిస్తోంది. అధికార పరంగా ఎలాంటి లోటు లేకపోయినా, ఆ అధికారాన్ని వినియోగించి తన ఆలోచనలను ఎంతవరకు అమలు చేయగలుగుతున్నారన్నదే అసలు చర్చ. "సీజ్ ది షిప్" వంటి వ్యాఖ్యలు వార్తల్లో నిలిచినా, వాటి ఫలితాలు ప్రజలకు స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణా, స్థానిక సమస్యలపై పవన్ స్పందించిన సందర్భాలు ఉన్నా, ఆ తర్వాత వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏ స్థాయిలో ఉన్నాయన్నది స్పష్టత లేనిదే అని అంటున్నారు. భీమవరం ప్రాంతంలో జూదం అంశంపై విచారణ కోరిన విషయం కూడా చర్చకు వచ్చినా, దాని తుది ఫలితం ఏమిటన్నది తెలియరాలేదు. ఎన్నికల సమయంలో జనసేన ఇచ్చిన హామీల విషయానికి వస్తే, యువతకు పెట్టుబడి సహాయం, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు వంటి అంశాలు ఇప్పటివరకు అమలులోకి రాలేదన్న అభిప్రాయం ఉంది. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పవన్ సమన్వయం ఎంతవరకు కొనసాగుతోంది అన్నదానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తానికి కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ స్థానం ఉన్నతమైనదే అయినా, రాజకీయంగా గానీ, ప్రజా విధానాల పరంగా గానీ ఆయన "మార్క్" ఇంకా స్పష్టంగా కనిపించలేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే కాలంలో అయినా జనసేన ప్రభావం పాలనలో కనిపిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

# సలహాదారులు ఎన్నాళ్లు...

విజయవాడ, జనవరి 2, ( (భారత శక్తి ప్రతినిధి)

అధికారం మారినా పద్ధతులు మారలేదు.. ప్రభుత్వాలు మారినా సలహాల సంస్కృతి పోలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో, సచివాలయ పరిసరాల్లో వినిపిస్తున్న ప్రధాన చర్చ ఇది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో సలహాదారుల వ్యవస్థపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తెలుగుదేశం పార్టీ, నేడు అధికారంలోకి వచ్చాక అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ముగ్గురు ప్రముఖులను సలహాదారులుగా నియమించడంతో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు, చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌లను వివిధ విభాగాలకు సలహాదారులుగా నియమించింది. వీరిలో శ్రీధర్, మంతెన సత్యనారాయణరాజు తమ తమ రంగాల్లో లబ్ధప్రతిష్టులే అయినప్పటికీ, ప్రభుత్వ పాలనలో వీరి పాత్ర ఎంతవరకు అవసరం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సలహాదారుల నియామకం ఒక ప్రహసనంగా మారిందన్నది బహిరంగ రహస్యం. దాదాపు ప్రభుత్వంలోని ప్రతి శాఖకు, ఉప శాఖకు కూడా సలహాదారులను నియమించి, వారికి క్యాబినెట్ ర్యాంకులు, భారీ జీతభత్యాలు, వాహనాలు, సిబ్బందిని సమకూర్చడంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది "సలహాదారుల ప్రభుత్వం" అని, ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని నాడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలంతా దుయ్యబట్టారు. "మేము అధికారంలోకి వస్తే ఈ సలహాదారుల వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని హామీ ఇచ్చారు. కానీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా విడతలవారీగా సలహాదారులను నియమించుకుంటూ వెళ్తుండటంతో, అప్పుడు తప్పు అయినది, ఇప్పుడు ఒప్పు ఎలా అవుతుంది? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఈ సలహాదారుల నియామకాల్లో వినిపించే ప్రధానమైన, సాంకేతికమైన అభ్యంతరం.. బ్యూరోక్రసీకి సంబంధించింది. అత్యంత కఠినమైన పరీక్షల్లో నెగ్గి, దశాబ్దాల తరబడి పాలనా అనుభవం ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు ప్రభుత్వ యంత్రాంగంలో అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సెక్షన్ ఆఫీసర్ వరకూ వేల సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడానికి ఈ వ్యవస్థ సరిపోదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అనుభవజ్ఞులైన అధికారులు ఉండగా, బాహ్య వ్యక్తులను సలహాదారులుగా తీసుకురావడం వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతింటుందనే వాదన కూడా ఉంది. ఒకవేళ సలహాలు నిజంగా అవసరమైతే, ఆయా రంగాల నిపుణులతో తాత్కాలిక కమిటీలు వేయవచ్చు కానీ, పూర్తిస్థాయి పదవులు ఎందుకనేది మేధావుల ప్రశ్న. ఈ నియామకాల వెనుక రాజకీయ ఉపాధి కోణం ఉందన్న విమర్శలను కొట్టిపారేయలేం. ఎన్నికల్లో టిక్కెట్లు దక్కని నాయకులకు, పార్టీ కోసం కష్టపడిన సానుభూతిపరులకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారికి ఏదో ఒక హోదా కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ పదవులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం తమ పార్టీ వారిని ఎలాగైతే అకాడమీల చైర్మన్లుగా, సలహాదారులుగా నియమించిందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా తమ మద్దతుదారులను తృప్తి పరచడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పథకంలా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులో ఉందని, అప్పుల కుప్పగా మారిందని ప్రభుత్వ పెద్దలే శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో.. సలహాదారుల జీతభత్యాలు, వారి కార్యాలయాల నిర్వహణ, వసతుల కల్పన ఖజానాపై అనవసరమైన భారాన్ని మోపుతాయి. ఒక్కో సలహాదారుడి నిర్వహణకు నెలకు లక్షల్లో ఖర్చు అవుతుంది. పొదుపు చర్యలు పాటించాల్సిన ప్రభుత్వమే ఇలా ఆర్భాటాలకు పోవడం ఎంతవరకు సమంజసం అనే చర్చ సామాన్యుల్లోనూ జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి నిపుణుల సలహాలు అవసరమే. కానీ అవి పాలనను మెరుగుపరిచేవిగా ఉండాలి తప్ప, రాజకీయ అవసరాలు తీర్చేవిగా ఉండకూడదు. కార్టూనిస్టులు, ప్రకృతి వైద్యులు సమాజానికి అవసరమే కానీ, వారి సేవలను ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో ఎలా వినియోగించుకుంటారో, తద్వారా సామాన్యుడికి ఏం మేలు జరుగుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే, గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందన్న అపవాదును కూటమి సర్కార్ మూటగట్టుకోక తప్పదు.

# కూటమిలో సమతూల్యం ఎలా

విజయవాడ, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

క్యాలెండర్ మారిన ప్రతిసారి కొత్త ఏడాది మీద ఆశలు, అంచనాలు సహజంగానే పెరుగుతాయి. 2025 ముగిసి 2026 ప్రారంభమవడంతో ఈ ఏడాదిలో ఏమి జరుగుతుంది, పరిస్థితులు ఎలా ఉంటాయి అనే ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. వ్యక్తిగత జీవితాలతో పాటు రాజకీయాలు, పరిపాలన, ఇతర రంగాలపై కూడా చర్చలు ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న పాలన రంగం గురించి సామాన్యులు కూడా ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, 2025 ఏడాది కూటమి ప్రభుత్వానికి ఒక విజయవంతమైన పాలనా సంవత్సరంగా గడిచిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటివరకు మిత్రపక్షాల మధ్య ఎలాంటి విభేదాలు బయటకు రాకుండా, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారని అంటున్నారు. కూటమిలో ఐక్యత కొనసాగడం వల్ల పరిపాలన సజావుగా నడిచిందన్న భావన కూడా బలంగా ఉంది. అయితే 2025లో కూటమి ప్రభుత్వంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. ముఖ్యంగా మెగా బ్రదర్ నాగబాబు (కు కేబినెట్‌లో అవకాశం వస్తుందన్న ప్రచారం జరిగింది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై తొమ్మిది నెలలు గడిచినా మంత్రి పదవి దక్కకపోవడంతో, దీని వెనుక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2026లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న మాట కూడా అప్పుడే మొదలైంది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించడంతో, 2026 జూన్ నాటికి రెండేళ్ల పాలన పూర్తవుతుంది. సాధారణంగా ప్రభుత్వాలు రెండేళ్ల తర్వాత తమ పనితీరును సమీక్షించి మంత్రివర్గంలో మార్పులు చేస్తుంటాయి. చివరి ఏడాది పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోతుందని, ఆ సమయంలో చేసిన మార్పులు ఆశించిన ఫలితాలు ఇవ్వవన్న అభిప్రాయం రాజకీయాల్లో ఉంది. అందుకే రెండేళ్ల సమయం కీలకమని భావిస్తారు. అదే లాజిక్ ప్రకారం, కూటమి ప్రభుత్వం కూడా రెండేళ్ల పాలనను బేరీజు వేసుకుని 2026లో పెద్ద ఎత్తున మార్పులు చేయవచ్చని చర్చ సాగుతోంది. ప్రస్తుతం కూటమికి 164 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మంత్రివర్గంలో ఒక ఖాళీ ఉంది. మార్పులు చేర్పులు చేస్తే మరో ఆరు లేదా ఏడు స్థానాలు అందుబాటులోకి రావచ్చని అంచనా. దీంతో కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్ర పోటీ ఉండడం ఖాయం. ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ అవసరాలు, సామాజిక సమీకరణలు అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటారని అంటున్నారు. అయితే ఎప్పుడు మార్పులు జరిగినా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు , రాయలసీమ నుంచి ఒక్కొక్కరికి పదవి గండం తప్పదన్న రాజకీయ జోస్యాలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు పనితీరు ఆశించిన స్థాయిలో లేని మరికొందరికి కూడా పదవులు కోల్పోయే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో విస్తరణ జరిగితే విశాఖ జిల్లా , కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా నుంచి ఒకరికి అవకాశం రావచ్చన్న అంచనాలు ఉన్నాయి. గోదావరి ప్రాంతంలో ఒక సీనియర్ బీసీ నేతకు, రాయలసీమలో ఒక బలమైన సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం దక్కే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తానికి 2026 ఏడాది ఎవరి ఆశలను నెరవేర్చుతుందో, ఎవరి రాజకీయ భవిష్యత్తుకు మలుపు తిప్పుతుందో వేచి చూడాల్సిందే.

# పోలవరం జిల్లాలో పోలవరం మిస్

ఏలూరు, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

మైసూరు బోండాలో మైసూరు ఉండదు" అన్న సామెతను గుర్తు చేసేలా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ఒక కొత్త చర్చ మొదలైంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్విభజన నిర్ణయంతో "పోలవరం జిల్లాలో పోలవరం ఊరే లేకపోవడం ఎలా?" అనే ప్రశ్న ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయం సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అధికారికంగా ఆమోదం పొందడంతో రాజకీయంగా, పరిపాలనపరంగా విస్తృత చర్చకు



దారితీసింది. మంత్రివర్గ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చ జరగగా, జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నిర్ణయం మేరకు రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న 26 జిల్లాల్లో 17 జిల్లాల్లో సరిహద్దులు, మండలాలు, డివిజన్లలో మార్పులు చేయనున్నారు. మిగిలిన 9 జిల్లాలు ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ నిర్ణయాల్లో అన్నమయ్య జిల్లా ( కేంద్రం మార్పు ఒక అంశంగా నిలవగా, పోలవరం జిల్లాలో పోలవరం గ్రామం లేకపోవడం మరింత చర్చకు దారి తీసింది. దీనిపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. గత 18 నెలలుగా రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలవరం జిల్లా పేరు ఉన్నప్పటికీ పోలవరం గ్రామం ఏలూరు జిల్లాలోనే కొనసాగడంపై విలేకరులు ప్రశ్నించగా, మంత్రి ఆసక్తికర ఉదాహరణ ఇచ్చారు. ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు కృష్ణా జిల్లా లో ఉన్నప్పటికీ, విజయవాడకేంద్రంగా ఏర్పడిన జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదే తరహాలో నిర్వాసిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని జిల్లాకు పేరు పెట్టడం పరిపాలనా అవసరాల కోసమేనని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, ఫిర్యాదుల ఆధారంగా కొన్ని మండలాలు, డివిజన్లను మార్చామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా జిల్లాలను విభజించడం వల్లే ఇలాంటి సమస్యలు వచ్చాయని, ఆ లోపాలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై నాదెండ్ల మనోహర్ కూడా స్పందిస్తూ, అప్పట్లో పారదర్శకంగా విభజన జరిగి ఉంటే ఇలాంటి గందరగోళం ఉండేదే కాదన్నారు. జిల్లా కేంద్ర హోదా కోల్పోతున్న రాయచోటి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ( హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రామప్రసాద్ కు ఈ నిర్ణయాలపై ముందుగానే వివరించామని తెలిపారు. మొత్తంగా ఈ మార్పులన్నీ రాజకీయ లాభాల కోసం కాకుండా, పరిపాలన సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవల కోసమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# వీవీఐపీలకే దేవుడా...

తిరుమల, జనవరి 2 (భారత శక్తి ప్రతినిధి)

దేవుడి దర్శనంలో ఒక కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. అర్జెంటుగా వెళ్లి దేవుడికి నమస్కారం చేయాలి. తనివి తీర దర్శనం చేసుకోవాలి. మనం అడిగే కోర్కెలను దేవుడు



మన్నించేయాలి. ఎక్కువమంది ఆలోచన ఇదే. దీనినుంచి పుట్టుకొచ్చింది వీఐపీ తనం. గ్రామంలో ఉండే చిన్న గుడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఈ వీఐపీ సంస్కృతి పెరుగుతూనే ఉంది. భారీగా డొనేషన్లు ఇచ్చారని.. లేకుంటే పాలనలో బిజీగా ఉండేవారు వీఐపీలుగా మారుతున్నారు. అటువంటి వారు వస్తే వేలాదిమంది దర్శనాలు నిలిపివేసి వారికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే సాధారణ ప్రజలకు విఐపిలు కావచ్చు కానీ.. దేవుడు ముందు మాత్రం వీరు తక్కువే. అయితే ప్రజలకు తాము వీఐపీలమని చూపుతున్న వీరు.. దేవుడు ముందు మాత్రం తగ్గి ఉంటున్నారు. ఎందుకంటే అనుగ్రహించాల్సింది ఆయనే కాబట్టి. అయితే ఈ వీఐపీ సంస్కృతి ఇప్పుడు ప్రతి చోట పెరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.దేవాలయం అనేది అహంకారం విడాల్సిన చోటు. అక్కడ అందరూ సమానమే. సామాన్యుల తో కలిపి గంటల తరబడి వేచి చూస్తే అక్కడ సహనం, సమయం విలువ తెలుస్తుంది. ప్రపంచంలో ఎంతటి పెద్ద ధనవంతుడైన, పదవిలో ఉన్నవారు అయినా దేవాలయానికి వస్తే దేవుడు దగ్గర యాచకుడు మాత్రమే. ఈ విషయాన్ని గుర్తించాలి. నిన్ననే ముక్కోటి ఏకాదశి పర్వదినం జరిగింది. ప్రతి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు జరిగాయి. ఉన్నది ఒకటే ద్వారం కానీ వీఐపీలు అనేకం. వేలాదిమంది సామాన్య భక్తులను ఇట్టే దాటుకొని స్వామివారిని వీఐపీ దర్శనం ద్వారా పూజలు చేసిన వారు చాలామంది ఉన్నారు. అయితే కొంతమంది క్యూలో నిలబడితే వచ్చే ఇబ్బందులు ఉన్నాయి. అటువంటి వీఐపీలు ప్రత్యేక దర్శనం ద్వారా వెళ్లిపోవచ్చు. కానీ అటువంటివారు కాకుండా గుర్తు పట్టని వీఐపీలు కూడా.. వేలాది మంది భక్తులను దాటుకుని వెళ్లి ప్రత్యేక దర్శనాలు చేసుకోవడం మాత్రం సామాన్యులకు ఇబ్బందికరమే.ఆయన దేవుడు.. మనం సేవకులం. మధ్యలో ఈ వీఐపీ సంస్కృతి ఏంటనేది ఒక వాదన. ఎందుకంటే దేవుడు ముందు అందరూ యాచకులే. అందరికంటే ముందు వెళ్లి అయ్యా నా కోరికల చిట్టా ఇది.. నా కష్టాలు ఇవి అని చెప్పుకుంటే దేవుడు తీరుస్తాడా? దేవుడికి అన్నీ తెలుసు. మన గుణగణాలు తెలుసు. అటువంటి దేవుడు తన మిగతా భక్తులను దాటుకొని వచ్చి.. కనీసం తన కోసం వేచి చూడకుండా.. సమయం ఇవ్వకుండా.. నేను వీఐపీని అంటూ ముందుకు వస్తే దేవుడు సహించగలడా? అనేది ప్రశ్న. ఇక్కడ దేవుడు అనేది ఒక నమ్మకం. ఆ నమ్మకాన్ని నమ్మకమైన రీతిలో అనుసరించాలే కానీ. వీఐపీ సంస్కృతి భక్తిత్వం మాత్రం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఇది సాటి మనుషులకు ఇబ్బందులకు గురి చేయడమే.

# 400 శాతం పెరగనున్న సిగిరెట్ ధర

ముంబై, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

సిగరెట్ తాగే వారికి ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి. ఇకపై సిగరెట్ తాగాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందేమో. లేదా సిగరెట్ తాగడం ఆపేయాలి. ఎందుకంటే సిగరెట్ ధరలు భారీగా పెరగనున్నాయని తెలుస్తోంది.ఎక్సైజ్ డ్యూటీ పెంచి సిగరెట్లను కొనలేనంత భారం చేయడానికి కేంద్రం సిద్ధమవుతోందట. అదే జరిగితే సిగరెట్ రేట్లు భగ్గుమనడం ఖాయం. అంటే.. ప్రస్తుతం 18 రూపాయలుగా ఉన్న ఒక్క సిగరెట్ ధర త్వరలో 72 రూపాయలకు పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదట. దీంతో రేట్లు పెంచేందుకు సెంట్రల్ ఎక్సైజ్ (అమెండ్‌మెంట్) బిల్-2025లో కేంద్రం ప్రపోజల్స్ పెట్టింది. పార్లమెంటు.. కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025కు ఆమోదం తెలిపిన తర్వాత దేశంలో సిగరెట్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రవేశపెట్టిన ఈ బిల్లు.. సిగరెట్లు, సిగార్ల నుండి హుక్కా, నమలబడే పొగాకు వరకు అనేక రకాల పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను సవరిస్తుంది.ప్రస్తుతం సిగరెట్ల పొడవు, రకాన్ని బట్టి ప్రతి 1,000 సిగరెట్ల ప్యాక్ పై రూ. 200 నుండి రూ. 735 వరకు సుంకం విధించబడుతోంది. తాజా సవరణ ప్రకారం ఈ సుంకం 2వేల 700-11వేల రూపాయలకు పెరగనుంది. నమిలే పొగాకు(చీవింగ్ టొబాకో)పై సుంకాలు 25% నుండి 100%కి అంటే నాలుగు రెట్లు పెరుగుతాయి. హుక్కా పొగాకుపై సుంకాలు 25% నుండి 40%కి పెరుగుతాయి. ధూమపాన (స్మోకింగ్)



మిశ్రమాలపై సుంకాలు 60% నుండి 300%కి అంటే 5 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఓవరాల్ గా చూస్తే.. ప్రస్తుతం రూ. 18 ఉన్న సిగరెట్ ధర త్వరలోనే రూ. 72 వరకు చేరొచ్చని అధికారులు అంచనా. ఈ పెంపు ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలకు దారితీసింది. "నేను ధూమపానం చేసేవాడిని కాబట్టి, నేను ఈ నిర్ణయం ఇష్టపడుతున్నాను. నేను కూడా దీన్ని మానేయొచ్చు" అని ఒక రెడ్డిట్ యూజర్ కామెంట్ చేశాడు. "ధూమపానం చేసే వారు నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పు మనలో చాలా మందిని ప్రభావితం చేయదు'' అని మరో యూజర్ అన్నాడు.కొందరు దీన్ని ప్రభుత్వ అతిక్రమణగా భావించారు. "నేను ఈ 'బిగ్ బ్రదర్' విధానాన్ని ద్వేషిస్తున్నా" అని ఒక యూజర్ అన్నాడు. ఇంతలో, మరికొందరు "బీడీ పీనే కా టైమ్ ఆగయా హై", "మై తో ఢిల్లీ కి హవా మే జీ లేతా హు.. ఫ్రీ ఫ్రీ ఫ్రీ" అని స్పందించారు.

# కూకట్ పల్లికి నిధులు ఇవ్వలేదు

## అభివృద్ధిని ఆపేసారు: ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ జనవరి 2 (భారత శక్తి ప్రతినిధి)

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్లు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయింది. మూడు కమిషనర్ల చేసి కూకట్ పల్లి నియోజకవర్గాన్నీ ముక్కలు చేశారు. స్టడీ టూర్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. నగరంలో ప్రజలతో రోడ్లు లేక డ్రైనేజీ లేక దోమలతో బాధపడుతున్నారు. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి ఆపేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయల భూములను అమ్మింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

రెండు కోట్ల రూపాయల అభివృధి పనులను బడ్జెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుతున్నారు. కూకట్ పల్లిలో రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక శంకుస్థాపన చేయలేదు. ఎన్ని కుట్రలు పెట్టిన ఎన్ని ప్రలోభాలు పెట్టిన రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే . ఫతే నగర్ బ్రిడ్జి,బాలానగర్ అండర్ పాసుకి టెండర్లు జరిగిన పనులు చేయట్లేదు రేవంత్ సర్కార్. స్టడీ టూర్ విహారయాత్రను కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు వేస్తే చట్టం ఉండదు. బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు పెట్టితే చించేస్తారు. రేవంత్ రెడ్డి రాక్షస పాలన జీవితంలో చూడలేదు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసింది కేసీఆర్ ప్రభుత్వమే . కళ్యాణ లక్ష్మీ ,రెండు వేల రూపాయల పెన్షన్లు,డబుల్ బెడ్ రూముల ఇచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమే. ఇప్పటికీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయలేదు బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం తప్ప. నల్ల చెరువు అభివృధి పనులు చేసిన హైడ్రా నాలా వేయకుండా పనులు చేశారు. 20 సెంటీమీటర్ల వర్షంపడుతే మళ్ళీ ఇండ్లు మునిగిపోతాయి. నగరంలో చెత్తలేకుండా ప్రణాళికలు చేసింది కేటీఆర్. ప్రతి కాలానికి ఆటోలతో చెత్త తీసేవిధంగా ఏర్పాటు చేశాం. స్వచ హైదరాబాద్ చేసింది కేసీఆర్



ప్రభుత్వమేనని అన్నారు.

కూకట్ పల్లి నియోజక వర్గం కార్పొరేటర్లు మాట్లాడుతూ ఒక నెల కాలంలో జిహెచ్ఎంసి కాలపరిమితి ముగుస్తోంది. మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్టడీ టూర్ విహారయాత్ర జరగనుంది. పదవీకాలం అయిపోయాక స్టడీ టూర్ దేనికి ఉపయోగమని ప్రశ్నించారు. ప్రజాధనం వృధా చేయడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అభివృధి శూన్యం. జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు రెండు కోట్ల రూపాయలు ఇస్తానని రేవంత్ రెడ్డి సర్కార్ చెప్పింది. ఇప్పటి వరకు రెండు రూపాయలు బడ్జెట్ ఇవ్వకుండా స్టడీ టూర్ వెళ్ళటం హాస్యాస్పదం . ప్రజాధనం ఇష్టం లేదు కాబట్టి కూకట్ పల్లి బిఆర్ఎస్ కార్పొరేటర్లం వెళ్లట్లేదని అన్నారు.

# 39 దేశాల నుంచి అమెరికాకు ఎవరూ వెళ్లలేరు

న్యూఢిల్లీ, జనవరి 2 (భారత శక్తి ప్రతినిధి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా మొత్తం 39 దేశాలపై×× ప్రయాణ నిషేధాన్ని విధిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడటం , ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడమే లక్ష్యంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణ ఆంక్షల జాబితాను భారీగా పెంచారు. 2025 జూన్‌లో 19 దేశాలపై ఉన్న ఆంక్షలను ఇప్పుడు 39కి విస్తరించారు. అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. జనవరి 1, 2026 ఉదయం 12:01 గంటల నుండి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.ఈ ఉత్తర్వులను ప్రభుత్వం రెండు భాగాలుగా విభజించింది. 19 దేశాలపై పూర్తి నిషేధం ఉండగా, మరో 20 దేశాలపై పాక్షిక నిషేధం అమలు చేస్తున్నారు. పూర్తి నిషేధం ఉన్న దేశాల పౌరులు ఎటువంటి వీసాలపై అమెరికాలో అడుగుపెట్టలేరు. పాక్షిక నిషేధం ఉన్న దేశాల పౌరులకు ఇమ్మిగ్రెంట్ వీసాలు, పర్యాటక (బి-1/బి-2), విద్యార్థి (ఎఫ్, ఎమ్, జె) వీసాల జారీని నిలిపివేశారు.

పూర్తి నిషేధం (19 దేశాలు + పాలస్తీనా):

ఆఫ్ఘనిస్తాన్, బుర్కినా ఫాసో, బర్మా (మయన్మార్), చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, మాలి, నైజర్, సోమాలియా, సౌత్ సూడాన్, సూడాన్, సిరియా, యెమెన్, సియెర్రా లియోన్ , పాలస్తీనా అథారిటీ జారీ చేసిన డాక్యుమెంట్లు ఉన్నవారు.

పాక్షిక నిషేధం (20 దేశాలు):

అంగోలా, ఆంటిగ్వా & బార్బుడా, బెనిన్, బురుండి, కోట్ డి ఐవరీ, క్యూబా, డొమినికా, గాబన్, గాంబియా,



మలావి, మౌరిటానియా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోగో, టోంగా, తుర్క్మెనిస్తాన్, వెనిజులా, జాంబియా, జింబాబ్వే.ఈ ఆంక్షలు కేవలం కొత్తగా వీసా పొందే వారికి మాత్రమే వర్తిస్తాయి. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగి ఉన్నవారికి, గ్రీన్ కార్డ్ హోల్డర్లకు (ఎల్పీఆర్), ప్రస్తుతం అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వారికి ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. అలాగే దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, , అత్యవసర మానవతా కారణాలతో వచ్చే వారికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అనుమతి లభించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా ఆఫ్రికా , మధ్యప్రాచ్య దేశాల నుండి వచ్చే లక్షలాది మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. 2026లో అమెరికా వేదికగా జరగనున్న ప్రపంచ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు క్వాలిఫై అయిన సెనెగల్, కోట్ డి ఐవరీ వంటి దేశాల అభిమానులకు కూడా ఇది ఇబ్బందిగా మారనుంది.

# బీఆర్ఎస్ విధానం ఫాలో అవ్వనున్న కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ అసెంబ్లీలో అధికార పార్టీతో పాటు తమకూ పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. లేకపోతే అన్యాయమని ఆరోపణలు చేస్తోంది. అది అన్యాయమా కాదా అన్నది ప్రజలు నిర్ణయిస్తారు కానీ.. వదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రతిపక్షాలను ఎంత మేర పరిగణనలోకి తీసుకుంది.. వారి వాయిస్ కు ఎంత మేర అవకాశం కల్పించిందన్నది గుర్తు చేసుకుంటే .. బీఆర్ఎస్ పార్టీ తాము విపక్షానికి ఎప్పుడూ ఇవ్వని కించిత్తు గౌరవాన్ని తాము భారీగా కోరుకుంటోంది.బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నేతలకు తగిన సమయం ఇచ్చేవారు కాదు. చిన్న చిన్న కారణాలతో సస్పెన్షన్లు చేయడం, మైకులు కట్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో నిత్యకృత్యంగా ఉండేవి. సభలో చర్చల కంటే ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యత ఉండేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తూ చర్చలకు వేదికగా అసెంబ్లీని మారుస్తున్నారు.దానికి ఇప్పటి వరకూ సాగిన అసెంబ్లీ తీరే సాక్ష్యం అనుకోవచ్చు.2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో సుదీర్ఘంగా పీపీటీ ఇచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా తమ వాదనను ప్రజెంటేషన్ ద్వారా వినిపిస్తామని, తమకూ అవకాశం ఇవ్వాలని బతిమిలాడినా బీఆర్ఎస్ కనికరించలేదు. ప్రభుత్వానికి మాత్రమే ప్రజెంటేషన్ ఇచ్చే హక్కు ఉంది అని నాడు బీఆర్ఎస్ నేతలు కరాఖండిగా చెప్పారు. ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ప్రజెంటేషన్ రూపంలో సమాధానం చెప్పే వీలు కల్పించకుండా కేసీఆర్ తన వాదనను ఏకపక్షంగా వినిపించారు. కానీ ఇప్పుడు మాత్రం తమకూ పీపీటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.విచిత్రమేమిటంటే, నాడు ప్రతిపక్షానికి ఏ అవకాశాన్నైతే నిరాకరించారో, నేడు అదే అవకాశాన్ని తమకు కల్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇవ్వనున్న పీపీటీకి కౌంటర్‌గా తాము కూడా ప్రజెంటేషన్ ఇస్తామని, తమకు ఆ హక్కు ఉందని స్పీకర్‌ను కోరుతున్నారు. నాడు ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారు, నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఈ డిమాండ్ పై కాంగ్రెస్ నేతలంటున్నారు. బీఆర్ఎస్ ఒత్తిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ఏ సంప్రదాయాన్ని పాటించిందో, తాము కూడా అదే బాటలో నడుస్తామని సంకేతాలు ఇస్తోంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించి ఉంటే.. ఇప్పుడీసమస్యలు వచ్చేవి కావని అనుకోవచ్చు.

# కొత్తగా లాజిస్టిక్ హబ్స్..

## భారీగా పెరగనున్న భూముల ధరలు, ఉద్యోగాలు

హైదరాబాద్, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

ప్రస్తుతం నిర్మాణంలో ట్రిపులార్‌తో హైదరాబాద్ నగర విస్తీర్ణం మరింత పెరగనుంది. దీంతో అవుటర్ రింగ్ రోడ్డు, ట్రిపులార్ మధ్య అభివృద్ధిని వరుసలు పెట్టించాలని అధికారులు నిర్ణయించారు. లాజిస్టిక్ హబ్స్ ఏర్పాటు చేయనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ వలయ రహదారి మధ్య ప్రాంతాన్ని ప్రభుత్వం భవిష్యత్ అభివృద్ధికి కేంద్రంగా ఎంచుకుంది. ఫోర్త్ సిటీ ఈ జోన్‌లోనే రూపుదిద్దుకోనుండటంతో మౌలిక వసతులపై దృష్టి పెరిగింది. నగర విస్తరణను ప్లాన్ చేసిన పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.విజన్ డాక్యుమెంట్ ప్రకారం ఈ కారిడార్‌లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు కీలకంగా మారింది. రవాణా రంగానికి అవసరమైన లాజిస్టిక్ హబ్‌లు కూడా ప్రధాన ప్రాజెక్టులుగా ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వీటి డిజైన్, అమలు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. గతంలో పటాన్‌చెరు పరిధిలోని లక్డారం, పటాన్‌చెరు ప్రాంతాల్లో లాజిస్టిక్ పార్కుల ప్రతిపాదనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కొత్త విజన్‌తో మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.ఈ అభివృద్ధి ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో లాజిస్టిక్ మౌలిక వసతులు ఏర్పాటుకానున్నాయి.

కంటెయినర్ డిపోలు

కంటెయినర్ స్టేషన్లు

ఫ్రీ వేర్‌హౌజింగ్ జోన్లు

ఫ్రైట్ విలేజీలు

ఆధునిక గోదాములు

కోల్డ్ స్టోరేజీ యూనిట్లు

ఎయిర్ కార్గో కాంప్లెక్సులు

సరుకు ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు

ఇవి అన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు.

ప్రస్తుతం నగరంలో సరుకు రవాణా వల్ల ట్రాఫిక్ భారం పెరుగుతోంది. దీనికి పరిష్కారంగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలను శివార్లకు తరలించాలనే ఆలోచనకు లాజిస్టిక్ హబ్‌లు బలంగా నిలుస్తున్నాయి. బాటసింగారం, మంగళపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే రెండు హబ్‌లు ఉన్నాయి.

# అగ్గిరాజేస్తున్న నీళ్లు

హైదరాబాద్, జనవరి 2,(భారత శక్తి ప్రతినిధి)

పోలవరం ? బనకచర్ల లింక్ కెనాల్ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అగ్నిరాజేసింది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే ఈ ప్రతిపాదనపై కేంద్ర జల సంఘం



(అచిఅ) అనుమతులు ఇచ్చిందన్న ప్రచారం, అధికార కాంగ్రెస్ ? ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది. ఈ తాజా వివాదానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సంచలన వ్యాఖ్యలే కారణం. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కు లింక్ ఏర్పాటు చేయడానికి సీడబ్ల్యూసీ పచ్చజెండా ఊపిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని, కేంద్రం వద్ద తెలంగాణ వాణిని బలంగా వినిపించలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ఈ ప్రాజెక్టు అనుమతులపై మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ఈ లింక్ ద్వారా గోదావరి నీళ్లను కృష్ణా ఆయకట్టుకు తరలిస్తే, భవిష్యత్తులో తెలంగాణకు గోదావరి జలాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హరీశ్ రావు ఆరోపణలను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతే తీవ్రంగా తిప్పికొట్టారు. అసలు అనుమతులే రాలేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం తరఫున వాస్తవాలను వినిపించారు. సీడబ్ల్యూసీ పోలవరం ? బనకచర్ల అనుసంధానానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, హరీశ్ రావు రాజకీయ లబ్ధి కోసమే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని, కోర్టు పరిధిలో ఉన్న అంశంపై కేంద్ర సంస్థలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేవని మంత్రి గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే జల దోపిడీ జరిగిందని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎదురుదాడి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజకీయ విమర్శలను పక్కనపెడితే, ఈ ప్రాజెక్టు సాంకేతికంగా రెండు రాష్ట్రాలకూ కీలకమైనది. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చే గోదావరి నీటిని, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు (శ్రీశైలం కుడి గట్టు కాలువ, తెలుగు గంగ తదితర) మళ్లించడం ఏపీ లక్ష్యం. దీనివల్ల కృష్ణా నదిలో నీటి లభ్యత లేనప్పుడు, గోదావరి జలాలతో రాయలసీమను ఆదుకోవచ్చని ఏపీ భావిస్తోంది. అయితే తెలంగాణ వాదన మరోలా ఉంది. బనకచర్ల అనేది కృష్ణా బేసిన్‌లోని భాగం. గోదావరి జలాలను అక్కడికి మళ్లిస్తే, కృష్ణా జలాల్లో మిగులు జలాల లెక్కలు మారిపోతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా, కృష్ణా జలాల్లో ఎగువ రాష్ట్రాలకు అదనపు వాటా దక్కాలి. ఈ లెక్కలు తేలకుండా, ఏపీ ఏకపక్షంగా నీటిని మళ్లిస్తే, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల కింద ఉన్న తెలంగాణ ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం ఉందనేది ఆ రాష్ట్రవాదన. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం, ఏపీ ప్రభుత్వం ఈ లింక్ కెనాల్ కోసం డీపీఆర్ ను సీడబ్ల్యూసీకి సమర్పించిన మాట వాస్తవమే. అయితే, దీనిపై గోదావరి, కృష్ణా బోర్డుల అభిప్రాయాలను, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సీడబ్ల్యూసీ తుది అనుమతి ఇచ్చే అవకాశం తక్కువ. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నందున, న్యాయపరమైన చిక్కులు లేకుండా కేంద్రం ముందడుగు వేయలేదు. ప్రస్తుతం పోలవరం ? బనకచర్ల అంశం ఒక పొలిటికల్ టూల్ గా మారింది. బీఆర్ఎస్ దీనిని సెంటిమెంట్ అస్త్రంగా వాడుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సమర్థంగా తిప్పికొట్టే పనిలో పడింది. అయితే, రాజకీయ ఆరోపణలు ఎలా ఉన్నా, గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ చిన్న ఏమరుపాటు ఉన్నా, భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం లేకపోలేదు.

# కవితకు ఓటు... ఎవరికి చేటు...

హైదరాబాద్, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చే ముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక సారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు. కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇది కేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ×4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అది నేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ



జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది. కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్ద సమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగా మారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# అసెంబ్లీలో పీపీటీ వార్

హైదరాబాద్, జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని




ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, అదనపు ఖర్చు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్ మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. 2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు.. ఇప్పుడు మేము మీకు ఇవ్వం అనే కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తామని అంటున్నారు. తమకు అసెంబ్లీలో పీపీటీ చాన్స్ ఇవ్వకపోతే.. కాంగ్రెస్‌కు కౌంటర్ గా తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చేందుకు హరీష్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్

హైదరాబాద్, జనవరి 2(భారత శక్తి ప్రతినిధి)

భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్లు దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.

వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి

మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్-2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ.

2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది.

ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది.

వేసవి సన్నాహాలు

గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకి వచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది.

నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు

2. మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం

3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం

4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ

5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు.

అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండని ప్రభుత్వం భావిస్తోంది.

==========================

# నంద్యాల చాబోలు హైవే పై వేగ ట్రావెల్స్ బస్సు బోల్తా

నంద్యాల జనవరి 2, (భారత శక్తి ప్రతినిధి)

చాబోలు మెట్ట పై ప్రైవేటు ట్రావెల్స్ వేగా బస్సు వేగంగా వచ్చి బోల్తా పడింది. నెల్లూరు నుంచి కర్నూలుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఘటనలో బస్సులోని అరు మంది ప్రమాణికులకు గాయాలు అయ్యాయి. హైవే పై పెద్దరాయి ఉన్నందున ఈప్రమాదం జరిగిందని డ్రైవర్ అంటున్నాడు. గాయపడిన ప్రయాణికులకు నంద్యాల ఆసుపత్రిలో చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పాతాళగంగ ప్రాంతంలో చిరుత సంచారం

శ్రీశైలం జనవరి 2, శ్రీశైల పాతాళగంగ మెట్ల దారిలో సత్యనారాయణ శాస్త్రి ఇంటి ముందు భాగంలో గురువారం అర్ధ రాత్రి 2 గంటల 30 నిమిషాల ప్రాంతంలో చిరుతపులి సంచరించడం జరిగింది. ఇది సీసీ కెమెరాలో రికార్డు అవ్వడంతో ఆయన వెంటనే చిరుత పులి సంచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈఓ శ్రీనివాసరావు, చైర్మన్ రమేష్ నాయుడు సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతంలో లో ఉండే స్థానికులు,భక్తులను అప్రమత్తం చేశారు. ఈ మెట్ల మార్గం ద్వారానే భక్తులు తెల్లవారు జామున పాతాళ గంగలో స్థానాలు ఆచరించడానికి నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. పాతాళ గంగ, సమీపన స్థానికులు నివాసం ఉండే ప్రాంతాల్లో మైకుల ద్వారా చిరుత పులి సంచారాన్ని తెలియజేస్తు అందరిని జాగ్రత్తగా ఉండాలని ఆలయ అధికారులు సూచనలు చేశారు.

# అంగన్వాడి చిన్నారులతో నూతన సంవత్సర వేడుకలు, చిన్నారులతో కలసి కేక్ కట్ చేసిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని రిజిస్టర్లు, స్టోర్ రూమ్‌ను పరిశీలించి, అంగన్వాడి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని, మరమ్మత్తులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, సంబంధిత ఐసిడిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: శుక్రవారం రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో జిల్లా కలెక్టర్



ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా పర్యటించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుడు నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతిని గమనించిన కలెక్టర్, లబ్ధిదారుడితో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు, తీసుకున్న రుణ వివరాలు, దశల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల కేటాయింపు పరిస్థితి, గతంలో నివసించిన ప్రాంతం, ప్రస్తుతం చేస్తున్న పని తదితర అంశాలపై లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అనంతరం గిద్ద గ్రామంలో డ్రైనేజీ కాలువలు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు చేపడుతున్న చర్యలను ఆయన గమనించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పిచ్చి మొక్కలు, చెత్తను పూర్తిగా తొలగించాలని, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల తొలగింపుతో పాటు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఆర్ డి ఓ వీణ, తహసిల్దార్ ఉమలత, డిపిఓ, డిఎమ్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# డీసీహెచ్ఎస్ నిర్మల్ జిల్లా అధికారిగా డాక్టర్ యూ. కాశీనాథ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జనవరి 02 (భారత శక్తి): భైంసా ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్‌గా సేవలందించిన డాక్టర్ యూ. కాశీనాథ్‌ను డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (ఆఅఊూ), నిర్మల్ జిల్లా అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా డాక్టర్ కాశీనాథ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భైంసా ఏరియా హాస్పిటల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ముత్యం రెడ్డి, ఇతర వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని డాక్టర్ కాశీనాథ్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కొత్త బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# భైంసా బస్సు డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభం

## ప్రమాద రహిత డ్రైవర్లకు ఘన సన్మానం నిర్మల్ ఆర్టీవో దుర్గాప్రసాద్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 02 (భారత శక్తి): భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భైంసా ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ జి. హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా ఆర్టీవో దుర్గాప్రసాద్, సిఐ , రవీందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లకు పలు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.

నిర్మల్ ఆర్టీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన అని తెలిపారు. డ్రైవర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రజా రవాణా వాహనాలు నడిపే డ్రైవర్ల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఒక్క చిన్న తప్పిదం అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సిఐ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగించడం, హెల్మెట్, సీటుబెల్ట్ లాంటి భద్రతా నియమాలను పాటించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శంగా ఉండి, ప్రజలకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు.

ఈ సందర్భంగా భైంసా ఆర్టీసీ బస్సు డిపోలో ప్రమాద రహితంగా విధులు నిర్వహించిన డ్రైవర్లైన మల్లికార్జున్, రవూఫ్ మరియు ఎస్.డి. మునీర్‌లను అతిథులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడుతూ ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరి తరహాలో ప్రతి డ్రైవర్ ప్రమాదాలు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

డిపో మేనేజర్ జి. హరి ప్రసాద్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డిపోలో పలు అవగాహన కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు..


## వినూత్న కార్యశాలకు వేదిక కానున్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ - పరిశ్రమ సంసిద్ధతపై విద్యార్థులకు అవగాహన

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 02:

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సంసిద్ధం చేసే లక్ష్యంతో, 'శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు ? విజయం నుంచి ఆత్మపరిశీలన వైపు ఒక ప్రయాణం' పేరిట ఈనెల 9న (శుక్రవారం) ఒకరోజు కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్యశాల సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్ గటాడి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.ప్రిన్స్ టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్, స్వాస్థ్య హబ్ లతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో టారో హీలర్, సంఖ్యాశాస్త్ర నిపుణురాలు, జీవిత లక్ష్యం, మనస్తత్వ కోచ్, ఎనర్జీ వెల్నెస్ మెంటార్ లిప్పీ భల్లాతో పాటు ప్రిన్స్ టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్ కొట్టాక్కి ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలియజేశారు.స్వీయ-అవగాహనతో కూడిన శాస్త్రీయ ఆలోచన, అంతర్గత సమతుల్యత దృష్టి, ఉత్పాదకత, నిర్ణయం తీసుకోవడం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి ఫార్మసీ విద్యార్థులకు ఈ కార్యశాల సహాయపడనుందన్నారు. అనుభవపూర్వక కార్యకలాపాల ద్వారా, మానసిక దృష్టి, శ్వాస నియంత్రణ, శక్తి అవగాహన, చేతన చర్య వంటి భావనలను ఇందులో పాల్గొన్నవారు అన్వేషించడంతో పాటు ఔషధాలలో సమతుల్య తను పునరుద్ధరించడం, మనస్సులో సమతుల్యతను కాపాడుకోవడం మధ్య సారూప్యాలను గుర్తిస్తారని తెలిపారు. కీలకమైన కార్యకలాపాలైన భావోద్వేగ భారాన్ని గుర్తించడం, శ్వాస ద్వారా దృష్టిని నియంత్రించడం, వ్యక్తిగత శక్తి నమూనాలను అర్థం చేసుకోవడం, ప్రతిచర్య నుంచి బుద్ధిపూర్వక ప్రతిస్పందనలకు మారడానికి విద్యార్థులకు వీలు కల్పించనున్నారు. ఫ్రేమ్ వర్కును సాధన, సంపూర్ణ ఆరోగ్యం, చర్య, పునరావృత సాధన, శ్వాస మీద ధ్యాస, లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడం వంటివన్నీ వివరిస్తారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులంతా, ఏకాగ్రతను పెంపొందించడానికి, వరధ్యానాలను నియంత్రించడానికి, నిర్ణయాలపై శక్తి ప్రభావాలను గుర్తించడానికి, తార్కిక తార్కికతను స్వీయ-అవగాహనతో అనుసంధానించడానికి తగిన నైపుణ్యాలను పొందనున్నట్టు ఆయన వెల్లడించారు.

# భైంసా ఆన్‌లైన్ బస్‌పాస్ కౌంటర్ లో అవ్వవస్థలు

## -విద్యార్థులు, జర్నలిస్టులకు అన్యాయం
## - అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 02 (భారత శక్తి): భైంసా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) భైంసా డిపో పరిధిలోని ఆన్‌లైన్ బస్‌పాస్ కౌంటర్‌లో నెలకొన్న అవ్యవస్థలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. గత సంవత్సరం నుండి కౌంటర్‌లో ఉన్న లామినేషన్ మెషిన్, కలర్ ప్రింటర్ సరిగా పని చేయకపోవడం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు మరియు జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం కౌంటర్‌లో కేవలం బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్‌తోనే బస్‌పాస్‌లు జారీ చేస్తుండటంతో, ఆన్‌లైన్ సౌకర్యం ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్‌పాస్ కోసం వచ్చే విద్యార్థులు, జర్నలిస్టుల నుంచి మాత్రం పూర్తి రుసుము వసూలు చేస్తుండటం అన్యాయమని పలువురు ఆరోపిస్తున్నారు.ప్రత్యేకంగా జర్నలిస్టు బస్‌పాస్‌కు ?50 రుసుము వసూలు చేసి, కలర్ ప్రింట్‌తో పాటు లామినేషన్ చేసి ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఆ సదుపాయం లేకుండా నాసిరకం పాస్‌లు అందజేస్తుండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని జర్నలిస్టులు మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి విద్యార్థుల పాస్‌ల విషయంలోనూ కొనసాగుతోందని వారు చెబుతున్నారు. అంతా తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది నుంచి సమస్య కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం ఆశ్చర్యకరమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ పేరుతో జాప్యం, సాంకేతిక లోపాలు కొనసాగుతుండటంతో ప్రయోజనం లేకుండా పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై భైంసా డిపో మేనేజర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జర్నలిస్టులు, విద్యార్థులు కోరుతున్నారు. ఎవరికి అన్యాయం జరగకుండా వెంటనే కలర్ ప్రింటర్, లామినేషన్ మెషిన్ మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో సేవలు అందించాలి అని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా టీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, భైంసా ఆన్‌లైన్ బస్‌పాస్ కౌంటర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి ,02 (భారత శక్తి): జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్లోని తన చాంబర్లో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు -2026 కు సంబంధించి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి ఒకటవ తేదీ నుంచి 31 వ తేదీ వరకు జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగేలా రోజువారిగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్టీవో దుర్గాప్రసాద్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ గ్రిడ్ పనులను తక్షణమే పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, జనవరి 02(భారత శక్తి) : చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల నియోజకవర్గ గ్రామాలకు తాగునీరందించే వాటర్ గ్రిడ్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పులివెందుల వాటర్ గ్రిడ్ పనుల పురోగతిపై రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ ప్రాజెక్టు మేనేజర్ లతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల వాటర్ గ్రిడ్ పథకం ద్వారా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించి ప్రాజెక్టు పనులను కూడా దాదాపు పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావడం జరిగిందన్నారు.

ఈ మొదటి వరంలోపే పులివెందుల నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్ లో ఉన్న తాగునీటి సరఫరా పనులను తక్షణమే పూర్తి చేసి ప్రారంభోత్సవంకు సిద్ధం చేసేలా దృష్టి సారించాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు ఇంకా ఏవైనా అవసరమైన వనరులను సమకూర్చుకుని తక్షణమే పూర్తి చేయాలన్నారు.

కాగా కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా.. రూ.480 కోట్ల వ్యయంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా పులివెందుల నియోజకవర్గంలో 109 గ్రామ పంచాయతీలలోని 299 గ్రామాలలోని 5.36 లక్షల జనాభా తోపాటు 7 రకాలైన ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన 135 ఒఖఅఆ ల మంచి నీటిని నిరంతరాయముగా నీరు అందించే ఉద్దేశ్యంతో పులివెందుల వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇందులో 1 ఇంటెక్ వాల్, 188 ాఉఋఖీ ల నిర్మాణము, 6 ాఉఃఖీ,.7 ఉబాఖీ, 10 ఉఃఖీ లు అలాగే 65 ఓఒఆ, 14 మధ్యంతర సంప్ లు కలిపి మొత్తం 225 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికి 200 లకు పైగా నిర్మాణాలు పూర్తి చేయడమైందన్నారు. ఈ ప్రాజెక్టు కు సంబంధించి దాదాపు 2000 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేయడం ద్వారా ఇంటింటికి పార్నపల్లె నీటిని కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించనుంది. కాగా ఈ పనులను డిసెంబర్ మాసం చివరి నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఇంకా కొద్దిమేర పెండింగ్ లో ఉన్న ఫినిషింగ్ పనుల అసంపూర్తిపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నెల మొదటి వారంలో అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు కిరణ్ కుమార్ రెడ్డి, అంజలీ దేవి, ఎంఈఐఎల్ ప్రాజెక్టు మేనేజర్ రవికుమార్, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# గణితంలో కల్లెం శ్రీనివాసరెడ్డికి పీహెచ్డీ

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 02:

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాసరెడ్డి కల్లెం డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'రంధ్రాల మాధ్యమంలో సాగే ఉపరితలంపై హైపర్ బోలిక్ టాంజెంట్ నానోఫ్లూయిడ్ ప్రవాహంలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ యొక్క గణన విశ్లేషణ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి శేరి గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశోధన మాగ్నెటో హైడ్రో డైనమిక్ ప్రభావాలు, ఉష్ణ బదిలీ ప్రవర్తన, అయస్కాంత క్షేత్ర ప్రభావం, నానోఫ్లూయిడ్ డైనమిక్స్ ను విశ్లేషించడానికి మ్యాట్ ల్యాబ్ యొక్క బీవీపీ4సీ ఫ్రేమ్ వర్కును ఉపయోగిస్తుందని వివరించారు. నాన్ లీనియర్ డిఫరెన్షియల్ సమీకరణాల సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఆయన కృషి చేసినట్టు తెలిపారు. ఈ పరిశోధనలు అణు రియాక్టర్ శీతలీకరణ, లోహశాస్త్రం, భౌగోళిక భౌతిక ప్రక్రియలు, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ వంటి అధునాతన శాస్త్రీయ, పారిశ్రామిక రంగాలలో వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇవి థర్మో-ఫ్లూయిడ్ వ్యవస్థల మెరుగైన రూపకల్పన, ఆప్టిమైజేషన్ కు దోహదపడతాయన్నారు.



డాక్టర్ శ్రీనివాసరెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ? గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లాను కమ్మేసిన మంచు పొగ మసక బారిపోయిన గ్రామాలు

ధర్మపురి

ఉదయపు వేళ? సూర్యుడు ఉదయించాల్సిన వేళ? జగిత్యాలతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని మండలాలలో చుట్టుముట్టినది మాత్రం వెలుగు కాదు.. తెల్లని మంచు పొగ. కళ్లముందు కనిపించే దృశ్యాలు కూడా మసకబారిపోయేంతగా ఉదయాన్నే దట్టమైన పొగ కమ్ముకుంది. రహదారులు, ఇళ్ల పైకప్పులు, చెట్ల కొమ్మలు అన్నీ ఒకే రంగులో కలిసిపోయి, జగిత్యాల పట్టణంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాలు నిశ్శబ్దంగా నిలిచినట్టుగా కనిపించింది. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కూడా సూర్యుడు కనిపించకపోవడంతో చలి గాలుల ప్రభావం తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచు పొగ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో డ్రైవింగ్ మరింత జాగ్రత్తగా చేయాల్సి వచ్చింది. చలితో పాటు తేమ ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లలోనే ఉండేందుకు మొగ్గుచూపుతున్నారు. రైతులు మాత్రం ఉదయపు వేళ పొలాల వద్దకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, ఈ మంచు వాతావరణం పంటలకు కొంత మేలు చేసే అవకాశముందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. మబ్బుల్లో మునిగిన దృశ్యాలు ఒకవైపు ప్రకృతి సౌందర్యాన్ని తలపించగా? మరోవైపు చలి తీవ్రతను గుర్తుచేస్తోంది. ఇంకా కొన్ని రోజులు ఇలాంటి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. మొత్తానికి మంచు ముసుగులో నిద్రలేచిన జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలలోని గ్రామాలు శీతాకాలపు నిశ్శబ్దాన్ని అనుభవిస్తూ మరో ఉదయాన్ని స్వాగతించింది.

# జ్ఞాన క్రాంతి సావిత్రి బాయి పూలే

మహారాష్ట్రలో జన్మించిన సావిత్రిబాయి పూలే
మహిళా లోకానికి వెలుగు సావిత్రిబాయిపూలే
పిడిత వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి
మహిళలకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే!!

మానవతా విలువలు కొనియాడినమాతృ మూర్తి
విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళ
సావిత్రిబాయి మహా శక్తి రచయిత్రిగా మంచి వక్తగా
భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు!!

మహిళలను చైతన్యం చేసిన నాయకురాలు
నిమ్న వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి
మహిళలకు ఒక దిక్సూచి సావిత్రిబాయి పూలే
మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం
సమాజమే తన ఇల్లు గా భావించిన సావిత్రిబాయి!!
సావిత్రి బాయిపూలే జయంతి, జనవరి 3 సందర్భంగా..



రచన :-
దేవులపల్లి రమేశ్,
నంగునూర్, సిద్దిపేట జిల్లా
9963701294

# గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తుంది గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్ 02 భారతశక్తి ప్రతినిధి, జనవరి 02:

చేతకాని పాలనతో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సరి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గత ప్రభుత్వం తప్పులతో ముద్రించిన పాస్ పుస్తకాల స్థానంలో.... రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు.

గుడివాడ మండలం సిద్ధాంతం గ్రామంలో రీ సర్వే గ్రామసభ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి యజమాన్యపు హక్కు మరియు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని చిన్ని రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... గత పాలకులు వ్యవస్థలను ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసన్నారు. ప్రజల ఆస్తులపై మహాత్మా గాంధీ మాదిరిగా జగన్ ఆయన ఫోటోలను ముద్రించుకొని, ప్రజాధనంతో పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు.

ఆస్తి మాది అనే భావన కలిగేలా యజమానుల ఫోటోలతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులు ఎంతో ఆనందంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రాము అన్నారు. ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే 25వేల పాసు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, నేటి నుండి ఈ నెల 9వ వరకు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే రాము చెప్పారు.

రైతాంగం ఆనందపడేలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, లింగం ప్రసాద్, గొర్రెపత్తి సుబ్బారావు, ఓఖీూ కిరణ్ కుమార్, గ్రామ నాయకులు ఇస్తా శ్రీనివాసరావు, వీరవరపు ఏసుబాబు, అడుసుమిల్లి గోపాలకృష్ణ, అడుసుమిల్లి లక్ష్మణరావు, సురేష్, కోరుమిల్లి స్వామి, మదిరి సుబ్బారావు, కటారి రాంబాబు, ఇస్సా కృష్ణమూర్తి, బాజీ, కోటిలింగం, పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కు తప్పిన ప్రమాదం


అంబేద్కర్ కోనసీమభారతశక్తి ప్రతినిధి, జనవరి 02:

సంక్రాంతి సందర్భంగా ఆత్రేయపురంలో ఏర్పాటు చేసిన పడవ పోటీల ట్రైల్ రన్ లో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్రైల్ రన్ లో భాగంగా ఆయన పడవను నడుపుతుండగా పడవ ఒకసారిగా తిరగబడింది. అక్కడ వున్న గజ ఈతగాళ్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ను కాపాడారు. కలెక్టర్ కు ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# చిక్కడపల్లి, దోమల్ గూడ లింక్ బ్రిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్జీహెచ్ఎంసీ నిధులు రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన చిక్కడపల్లి ? దోమల గూడ లింక్ బ్రిడ్జి ను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే ముఠా గోపాల్ , మేయర్ గద్వాల విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్ లు తదితరులు పాల్గొన్నారు..

# సినిమా




## రాజే యువరాజే ఫుల్ సాంగ్


ప్రభాస్, దర్శకుడు మారుతి కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజా సాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాను ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. క్రిస్మస్ స్పెషల్‌గా 'రాజే యువరాజే' సాంగ్ ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేసిన మేకర్స్ న్యూ ఇయర్ గిఫ్ట్‌గా ఫుల్ ఆడియో సాంగ్ విడుదల చేశారు. ''రాజే యువరాజే.. కొలిచేటి తొలి ప్రేమికుడే.. నడిపించేది అతడే'' అంటూ సాగే ఈ మ్యూజికల్ సాంగ్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ ఈసారి ఫ్రెష్ ట్యూన్‌తో మరోసారి మెస్మరైజ్ చేయనున్నాడని అర్థమవుతోంది. 'ది రాజా సాబ్' ఇండియాలోనే బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ మూవీగా రూపొందుతున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. ఇది ప్రభాస్ కెరీర్‌లోనే తొలి హారర్ జానర్ చిత్రం కావడం విశేషం.





## ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్

పవర్ స్టార్ అభిమానులకు న్యూ ఇయర్ కానుకగా పవన్ కళ్యాణ్ కొత్త సినిమా అప్డేట్ వచ్చేసింది. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్ కంప్లీట్ అవ్వడంతో.. దాని తర్వాత పవన్ సినిమాల్లో కంటిన్యూ అవుతారా? లేదా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో పవర్ స్టార్ సినిమా ప్రయాణం పై అందరికీ క్లారిటీ వచ్చింది. ఆయన హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇదే విషయాన్ని నిర్మాత రామ్‌తాళ్లూరి అధికారికంగా ప్రకటించాడు. పవన్ కళ్యాణ్ పేరు పెట్టిన సంస్థ.. జైత్ర రామ్ మూవీస్ బ్యానర్ పై ఈ సినిమా రానున్నట్లు పోస్టు పెట్టాడు. 'జైత్ర రామ మూవీస్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.1గా నా డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రారంభమవుతోంది. మన ప్రియమైన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రేమ, ఆశీస్సులతో ఈ సంస్థకు నామకరణం జరిగింది. సురేందర్ రెడ్డి, వక్కంతం వంశీతో కలిసి పనిచేస్తున్నాను. ఎప్పటికీ కృతజ్ఞుడిని. ఎప్పటికీ గర్వపడతాను. డ్రీమ్ ప్రాజెక్ట్ లోడింగ్' అని పేర్కొన్నాడు.



## డ్రీమ్ ప్రాజెక్ట్



ఇటీవల మదరాసి మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమిళ డైరెక్టర్ ఏ.ఆర్.మురగదాస్. తాజాగా ఆయన మరో కొత్త ప్రాజెక్టును ప్రారంభించపోతున్నాడు. ఈసారి ఆయన గ్రాఫిక్స్ తో కూడిన ఒక కామెడీ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడట. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఐడియా మాత్రం 25 ఏండ్ల క్రితం నాటిదట. వివరాల్లోకి వెళితే.. మురగదాస్ 2001లో తమిళ స్టార్ హీరో అజిత్ తో ధీనా అనే మూవీ చేశాడు. అయితే దాని కంటే ముందే ఆయన ఒక ప్రాజెక్టు చేయాలనుకున్నాడట. తాను అసిస్టెంట్‌డైరెక్టర్‌గా చేస్తున్న సమయంలోనే ఒక కోతిని పెట్టి సినిమా తీయాలని భావించాడట. పిల్లలు బాగా నచ్చే విధంగా ఉంటుందని ఆ నిర్ణయం తీసుకున్నాడట. అయితే ఆ సమయంలో అది కుదరలేదు. అలా తన కెరియర్ మొదట్లో అద్భుతంగా తయారు చేసుకున్న ప్రాజెక్టు వర్క్ అవుట్ కాకుండానే కాలచక్రం 25 ఏండ్లు ముందుకు సాగింది. కానీ ఆయనలో తన మొదటి డ్రీమ్ ప్రాజెక్టు ఆలోచన మాత్రం అలాగే ఉండిపోయింది. దీంతో నాటి ఐడియాతో ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.



## అడ్వాన్స్ బుకింగ్స్‌లో విజయ్ 'జన నాయగన్' దూకుడు..


విజయ్ (Vijay) కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే తమిళ వెర్షన్‌కు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. వీటిద్వారా ఇప్పటివరకూ రూ.15 కోట్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. విజయ్ నటిస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తెలుగులో విజయవంతమైన 'భగవంత్ కేసరి'కి రీమేక్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఈ క్రమంలో దర్శకుడు హెచ్.వినోద్ స్పందించారు. 'నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు. వచ్చి సినిమా చూడండి' అని అన్నారు. జనవరి 3న ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అది వస్తే చాలా విషయాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## ఘనంగా ఎఫ్.ఎన్.సి.సి సినీ పురస్కారాల ప్రదానం




ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్.ఎన్.సి.సి) సినీ పురస్కారాల ప్రదానం బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిన్న సినిమాల్ని, కొత్త ప్రతిభని ప్రోత్సహించడమే లక్ష్యంగా... 2025కిగానూ ఉత్తమ చిత్రంగా 'కోర్ట్'కు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ కథానాయకుడు, ఉత్తమ కథానాయిక విభాగాల్లో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రానికి పురస్కారాల్ని ప్రదానం చేశారు. 'కోర్ట్' దర్శకనిర్మాతలు రామ్ జగదీశ్, దీప్తి గంటా, 'రాజు వెడ్స్ రాంబాయి' నిర్మాతలైన వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, దర్శకుడు సాయిలు కంపాటి, కథానాయకుడు అఖిల్‌రాజ్‌లకు సినీ ప్రముఖులు అల్లు అరవింద్, అశ్వనీదత్, ఎఫ్.ఎన్.సి.సి అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు పురస్కారాల్ని ప్రదానం చేశారు. జ్ఞాపికతోపాటు, రూ.25 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అనంతరం నిర్మాతలుగా యాభయ్యేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న అల్లు అరవింద్, అశ్వనీదత్‌తోపాటు, సినీ, రాజకీయ ప్రముఖులు కాజా సూర్యనారాయణను ఈ వేదికపై ఎఫ్.ఎన్.సి.సి కమిటీ సన్మానించింది. వి.బి. ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో టెలివిజన్ పురస్కారాల్నీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.నారాయణ, శోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఊహించని మలుపుల.. ది బ్లాక్ గోల్డ్






'ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ''ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణే మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.




# ATMల నుంచి ఇక ₹500 నోట్లు రావా? నిజమెంత?



2026 మార్చి నాటికి ఏటీఎంల నుంచి రూ.500 నోట్లను ఆర్‌బీఐ నిలిపివేస్తుందంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. మార్చి నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ₹500 నోట్ల చలామణిని నిలిపివేస్తుందంటూ కొన్ని సోషల్ మీడియా పోస్టులు పేర్కొంటున్నాయని తెలిపింది. ఇది పూర్తిగా అసత్య ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఓ పోస్టు పెట్టింది. ''ఆర్‌బీఐ అలాంటి ప్రకటన ఏదీ చేయలేదు. రూ.500 నోట్లు నిలుపుదల కావు, అవి చట్టబద్ధంగానే చెల్లుబాటు అవుతాయి'' అని స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి అసత్య వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. ఏదైనా వార్తను నమ్మడం లేదా వాటిని వేరొకరికి షేర్ చేసే ముందు అధికారిక వర్గాల నుంచి ధ్రువీకరించుకోవాలని సూచించింది.

# 90 రోజులు పనిచేస్తే గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత.. కేంద్రం డ్రాఫ్ట్ రూల్స్



గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత కల్పనకు సంబంధించి కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఒక ఆర్థిక సంవత్సరంలో గిగ్‌వర్కర్లు ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు.. ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద 120 రోజులు పనిచేయాల్సి ఉంటుంది. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటి డిమాండ్లతో గిగ్ వర్కర్లు గత నెల రెండుసార్లు సమ్మెకు దిగిన వేళ కేంద్రం ఈ ముసాయిదా నిబంధనలు తీసుకురావడం గమనార్హం. ఒకరోజు అగ్రిగేటర్ వద్ద పనిచేస్తే.. వచ్చిన ఆదాయంతో సంబంధం లేకుండా దానిని ఒకరోజు కింద పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ ఒక గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే.. దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. అలాగే నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. అసంఘటిత కార్మికులకు జాతీయ డేటాబేస్‌గా పరిగణిస్తున్న ఇశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికే సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. కార్మికశాఖ ఇప్పటికే రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. ఇందులో నమోదు చేసుకున్నవారికి ఫొటోగ్రాఫ్, ఇతర వివరాలతో కూడిన ఐడీ కార్డు జారీ చేస్తారు. ఎప్పటికప్పుడు తమ వివరాలను ఇందులో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30నే ప్రభుత్వం విడుదల చేసింది. ఇదిలాఉంటే.. డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఆ తరుణంలోనే స్విగ్గీ, జొమాటో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాయి కూడా.




# మార్కెట్‌లోకి కొత్త కియా సెల్టోస్.. ధర ₹10.99 లక్షల నుంచి ప్రారంభం




ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను దేశీయ మార్కెట్‌లో విడుదల చేసింది. గట్టి పోటీ ఉన్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అత్యాధునిక హంగులతో 2026 మోడల్ సెల్టోస్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధరను రూ.10.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. గరిష్ఠ ధరను రూ.19.99 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా పేర్కొంది. జనవరి రెండో వారం తర్వాత నుంచి వీటి డెలివరీలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. రూ.25వేల టోకెన్ అమౌంట్‌తో డిసెంబర్ 11 నుంచి బుకింగ్స్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

**ధర వివరాలు..**

కియా సెల్టోస్ HTE, HTK, HTX, GTX, XLine వంటి ఐదు ట్రిమ్స్‌లో లభిస్తుంది. ఇందులో హెచ్‌టీఈ బేస్ మోడల్ కాగా.. జీటీఎక్స్ అనేది టాప్ ఎండ్ మోడల్. ఈ కారు 1.5 లీటర్ నేచరల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ (115 హెచ్‌పీ, 144 Nm), 1.5లీటర్ టర్బో పెట్రోల్ (160 హెచ్‌పీ, 253 Nm), 1.5లీటర్ డీజిల్ (116 హెచ్‌పీ, 250 Nm) ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. ఎంటీ, ఐవీటీ, డీసీటీ, ఏటీ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి ధరలను పట్టికలో గమనించొచ్చు. కొత్త కియా సెల్టోస్ డిజైన్ విషయానికొస్తే.. గ్లోబల్ మోడల్ నుంచి పొందిన స్ఫూర్తితో టైగర్ నోజ్ గ్రిల్‌తో తీసుకొచ్చారు. దీనికి వర్టికల్ లైటింగ్ ఎలిమెంట్లు జోడించారు. ఈ ఎస్‌యూవీలో 18 అంగుళాల అలాయ్ వీల్స్ ఇచ్చారు. కనెక్టెడ్ టైల్ లైట్లతో కూడిన అప్‌డేటెడ్ టైల్‌గేట్‌ను ఇచ్చారు. పనోరమిక్ సన్‌రూఫ్, ఇంటిగ్రేటెడ్ రియర్ స్పాయిలర్, షార్క్ ఫిన్ యాంటెన్నా వంటివి ఉన్నాయి. మొత్తం 10 బాడీ పెయింట్ ఆప్షన్లతో తీసుకొచ్చారు. ఇందులో మార్నింగ్ హేజ్, మాగ్మా రెడ్ కొత్తవి. ఈ సెగ్మెంట్‌లో అత్యంత పొడవైన కారు (4,460 మి.మీ.) ఇదేనని కంపెనీ తెలిపింది. 1,830 మి.మీ. వెడల్పు, 1,635 మి.మీ. ఎత్తు, 2,690 మి.మీ. వీల్‌బేస్‌తో వస్తోంది. గతంతో పోలిస్తే వీల్‌బేస్ 80 మిల్లీమీటర్లు పెరిగింది. వీల్‌బేస్ పెరగడం వల్ల లెగ్‌రూమ్ కూడా ఆ మేర పెరిగింది. కారు లోపల 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ సింగిల్ ప్యానెల్ విజువల్ కమాండ్ సెంటర్ ఉన్నాయి. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, 64 కలర్ యాంబియెంట్ మూడ్ లైటింగ్, డీ కట్ డ్యూయల్ టోన్ లెదర్ స్టీరింగ్ వీల్‌ను ఇచ్చారు. 6 ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, అన్ని వీల్స్‌కు డిస్కు బ్రేకులు, 360డిగ్రీల కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, OTA అప్‌డేట్లతో కూడిన రిమోట్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, నావిగేషన్ బేస్డ్ స్మార్ట్ క్రూజ్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి.




# ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు.. విమర్శలపై స్పందించిన బీసీసీఐ..!




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ వర్గాలు స్పందించాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 15న యూఏఈ రాజధాని అబుదాబిలో జరిగింది. ఈ వేలంలో ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 9.2 కోట్లకు దక్కించుకుంది. దాంతో ఐపీఎల్‌లో ఆడుతున్న అత్యంత ఖరీదైన బంగ్లాదేశ్ ఆటగాడిగా నిలిచాడు. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి.. 65 వికెట్లు తీశాడు. కాగా.. పొరుగుదేశంలో రాజకీయ అస్థిరత వేళ.. మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

*** దౌత్య విభేదాల వేళ.. భారత్‌తో షెడ్యూల్ ప్రకటించిన బంగ్లా క్రికెట్ జట్టు..!**

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (BCB) తమ జట్టు ఆడే సిరీస్‌లపై ప్రకటన చేసింది. దౌత్య విభేదాల వేళ భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. భారత్‌తో ఆగస్టు సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు తెలిపింది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సి ఉండగా.. రాజకీయ ఉద్రిక్తతల కారణంగా నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ వెల్లడించింది.

# ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లోకి.. వీనస్ విలియమ్స్ రీఎంట్రీ



అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేస్తున్నారు. జనవరిలో ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం ఆమెకు ఇప్పటికే వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. ఏడుసార్లు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ అయిన ఆమె.. కొన్ని రోజుల క్రితమే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మోడల్, యాక్టర్ ఆండ్రియా ప్రెటిని పెళ్లి చేసుకున్నారు. జనవరి 18 నుంచి మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఈ ఓపెన్ మెయిన్ డ్రాలో తలపడనున్న పెద్ద వయస్కురాలు వీనసే కావడం గమనార్హం. ఇప్పుడు ఆమె వయసు 46 ఏళ్లు. అంతకుముందు ఈ రికార్డు జపాన్‌కు చెందిన కిమికో డేట్ పేరిట ఉండేది. ''ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేయడంపై సంతోషంగా ఉన్నాను. ఇక్కడ నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి'' అని వీనస్ సంతోషం వ్యక్తంచేశారు.



# అక్కడి పిచ్‌లు మాత్రం భేష్.. భారత్‌లో అలా జరిగితేనేమో గగ్గోలు!

*** యాషెస్‌లో రెండురోజుల్లోనే ముగిసిన రెండు మ్యాచ్‌లు**

భారత్‌లో ఎప్పుడైనా టెస్టు మ్యాచ్‌లో పిచ్‌లు స్పిన్నర్లకు బాగా అనుకూలిస్తే.. మ్యాచ్ రెండు మూడు రోజుల్లో ముగిసిపోతే ఇక అంతే సంగతులు! ప్రపంచ క్రికెట్ ప్రమాదంలో పడ్డట్లు నానా యాగీ చేస్తారు విదేశీ జట్ల మాజీ క్రికెటర్లు, మీడియా ప్రతినిధులు. ఇవేం పిచ్‌లని.. మ్యాచ్‌లను ఇలా ఏకపక్షం చేయడమేంటని టీమ్‌ఇండియాను తప్పుబట్టే ప్రయత్నం చేస్తుంటారు. కానీ విదేశాల్లో పేస్ వికెట్లు కూడా అంతే అనూహ్యంగా స్పందిస్తే.. మ్యాచ్‌లు త్వరగా ముగిసిపోతే మాత్రం గప్‌చుప్!

**తమ జట్టు గెలిచినా సరే..**

యాషెస్ సిరీస్‌లో భాగంగా.. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమిచ్చిన నాలుగో టెస్టులో రెండు రోజులు కూడా పూర్తిగా ఆట సాగలేదు. సిరీస్‌లో అప్పటికే 03తో వెనుకబడ్డ ఇంగ్లాండ్.. ఈ మ్యాచ్‌లో గెలిచి ఊరట పొందింది. తమ జట్టు గెలిచినా సరే.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్.. పిచ్ స్పందించిన తీరుపై అసహనం వ్యక్తం చేశాడు. ఏ పిచ్ ఇస్తే దానిపై ఆడడమే తమ పని అంటూనే.. మరీ ఇలా రెండు రోజులకే మ్యాచ్ ముగిసిపోతే ఎలా అన్నాడు. బాక్సింగ్ డే టెస్టు చూడాలని ఎంతో ఆసక్తితో అయిదు రోజులకు టికెట్లు కొన్నవారి పరిస్థితేంటని ప్రశ్నించాడు. ఆస్ట్రేలియా కాకుండా మరో చోట పిచ్ ఇలా స్పందిస్తే ఎలా ఉండేదో అంటూ ఆశ్చర్యపోయాడు.

**పెర్త్‌లోనూ.. రెండు రోజుల్లోనే..**

ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ అయితే.. భారత్‌లో పిచ్ ఇలా ఉంటే గగ్గోలు పెట్టేవారని.. ఆస్ట్రేలియాలో వికెట్ ఇలా స్పందించడం గురించి కూడా చర్చ జరగాలని అన్నాడు. ప్రస్తుత యాషెస్‌లో ఒక టెస్టు రెండు రోజుల్లోనే ముగిసిపోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం.. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టు కూడా రెండో రోజే పూర్తయింది. అందులో ఆస్ట్రేలియా గెలిచింది. యాషెస్‌లో ఇప్పటిదాకా జరిగిన నాలుగు టెస్టులు కలిపి 13 రోజుల్లోనే పూర్తయిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అయినా పిచ్‌ల మీద ఎలాంటి ప్రశ్నలు, విమర్శలు రాకపోవడంపై భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

**భారత పిచ్‌లపై అక్కసు!**

భారత్‌లో పిచ్‌లు స్పిన్నర్లకు బాగా సహకరించి, విదేశీ బ్యాటర్లు తడబడినప్పుడల్లా ఇక్కడి వికెట్ల నాణ్యత గురించి అటు వైపు నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. పిచ్‌ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం, పర్యటక జట్లు ఐసీసీకి (ICC) ఫిర్యాదులు చేయడం జరుగుతుంటుంది. ఐసీసీ నుంచి హెచ్చరికలు రావడం, పిచ్‌లకు అయోగ్యత పాయింట్లు ఇవ్వడం కూడా మామూలే. ఇటీవల దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు మూడో రోజే ముగిసిపోయింది. ఆ మ్యాచ్‌లో బౌలర్లు విజృంభించారు. ఆ మ్యాచ్‌లో 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ 93 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిచింది కాబట్టి పిచ్ నాణ్యత గురించి విదేశీ మీడియాలో చర్చ లేదు. ఒక వేళ భారత్ నెగ్గి ఉంటే మాత్రం తనకు అనుకూల వికెట్ తయారు చేసుకుని ప్రత్యర్థిని దెబ్బ తీసిందని.. పిచ్‌ల నాణ్యత ఇలా ఉంటే ఎలా అనే ప్రశ్నలు తలెత్తేవి.

**తప్పక తగ్గించారా?**

ఈ యాషెస్‌లో తొలి టెస్టు రెండు రోజుల్లోనే ముగిసినా.. పెర్త్ పిచ్ గురించి విమర్శలు లేవు. మ్యాచ్ రిఫరీ కూడా దాని గురించి ప్రతికూల నివేదిక ఇవ్వలేదు. ఐసీసీ సైతం దానికి తక్కువ రేటింగ్ ఇవ్వలేదు. ఈ విషయంలో సునీల్ గావస్కర్ ఆశ్చర్యపోయారు.

# రంపాడ్ రోడ్డు నుండి రెడ్డి కొట్టాల మీదుగా బసనపల్లి వరకు రోడ్డు విస్తరణ చేయాలి

* సిపిఐ డిమాండ్
* రోడ్డు ఆనుకొని ఉన్న బావులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలి -సిపిఐ
* కుంగుతున్న రెడ్డి కొట్టాల చెరువు కట్ట పై రోడ్డు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు. సిపిఐ ఆగ్రహం



పోరుమామిళ్ల (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: పోరుమామిళ్ల , రంపాడు రోడ్డు నుండి, రెడ్డి కొట్టాల మలుపు వరకు ఉన్న మలుపులు, బావులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్త వహించాలని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ వారి బృందం తో శుక్రవారం రోడ్డు పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మస్తాన్,కేశవలు మాట్లాడుతూ పోరుమామిళ్ల రంపాడు రోడ్డు నుండి ప్రతిరోజు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలు వందల కొద్ది వెళ్లడం, అలాగే వర్షాలు బాగా కురిసి ,రెడ్డి కొట్టాల చెరువు నిండి కట్టంతా కృంగిపోతూ ,ఒకసారి తూము వద్ద రంధ్రం కూడా పడడం జరిగింది దానికి తోడు రెండు కిలోమీటర్ల దూరంలోపు ఆరు బావులు రోడ్డు ఆనుకొని ఉండడం వలన రోడ్డు కృంగిపోతూ ఉన్నది అలాగే నెర్రెలు భారీ రోడ్డు వెంపటి ఉన్న కంపచెట్లను, రోడ్డు పనులు చేసేవారు మామా అన్న రీతిలో డోజర్ తో వారాలంపటి గీకించి రోడ్డంతా శుభ్రం చేశాము అన్న రీతిలో బిల్లులు చేసుకోవాలని చూడడం చాలా బాధాకరం. ఒకపక్క ఈ రోడ్డు వెంబడి ప్రతిరోజు స్కూల్ వాహనాలు 20 వాహనాలు వస్తూ ఉంటాయి తరువాత ఆటోలల్లో, వందలాదిమంది కూలీ పనులకు వెళ్లే రైతులు వెళుతూ ఉంటారు, మరియు పై భాగంలో బసనపల్లె ,నల్లేరు కొట్టాల, సావిశెట్టి పల్లె ప్రాంతాల ఉన్న పొలాలలో అరటి, బొప్పాయి, జామ, శీని, దానిమ్మ, వర్రీ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు లాంటి పంటలు కొనుగోలు చేసేందుకు ప్రతిరోజు వందల పైబడి ఆటో మినీ లారీ, పెద్ద లారీలు వెళ్లాల్సిన పరిస్థితి, కానీ రోడ్డు చూస్తే పది అడుగుల వెడల్పు కూడా లేకపోవడం ఎదురుగా వాహనం వస్తే పక్కకు సైడ్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది కనుక ఆర్ అండ్ బి అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ చేసి వెంటనే రంపాడు నుంచి బసనపల్లె వరకు వెళ్ళు రోడ్డును విస్తరణ చేసి ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా సమితి పక్షాన అధికారులకు తెలియజేయడమైనది లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు కోడూరు కేశవ, ఎర్రబల్లె ప్రసాద్, శ్రీనివాసులు, హసన్ వల్లి,జైపాల్, వెంకటసుబ్బయ్య, యాకోబ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .



## శ్రీ వెంకటేశ్వర దేవాలయం
# నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్బీనగర్, జనవరి 02 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని, శ్రీ వెంకటేశ్వర కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర దేవాలయం నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది. చైర్మన్ గా ధర్పల్లి అశోక్, వైస్ ఛైర్మన్ గా శాంతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గా ఎం. నాగభూషణ్ రావు, జాయింట్ సెక్రటరీ గా తులసీ కృష్ణమూర్తి, కోశాధికారిగా ఆర్.శ్రీమన్నారాయణ, ధర్మకర్తలుగా కాలనీ అధ్యక్షులు గండు ధనం రెడ్డి, ఆర్. భోగేశ్వర్ రావు, జి. ప్రతాప్ రెడ్డి, ఆర్.విజయ్ కుమార్, గరగ సాయికుమార్, సత్యనారాయణ మూర్తి, టి.శ్రీనివాస్ రావు, ఎం.వీరేందర్ రెడ్డి, పి. శ్రీనివాస్ కుమార్, రాజశేఖర్, కే.వి.సుబ్బారావులు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గం జనవరి 1వ తేదీ స్వామి వారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ పూజారులు వంశధార చార్యులు, రామకృష్ణ చార్యులు, శ్యామ్ సుందర్ లు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయం శాశ్వత సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు బండారు యాదగిరి

* అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలి!



సంగారెడ్డి (భారత శక్తి) జనవరి 02 : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టి యు డబ్ల్యూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి గురువారం నాడు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు కొత్త సంవత్సరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం మరింత స్పూర్తివంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు జిల్లాలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు జిల్లా యంత్రాంగానికి సంపూర్ణంగాసహకరిస్తున్నామని అందువల్ల జిల్లా యంత్రాంగం కూడా జర్నలిస్టుల పట్ల అదేవిధంగా సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు ఇటీవల కొత్త అక్రిడిటేషన్ పాలసీ వచ్చిందని దానిలో కూడా అనేక మార్పులు చేయాల్సిందిగా తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ జిల్లాకు చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ ఆధ్వర్యంలో ఇటీవల విజ్ఞప్తి చేశామన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి దీనికి సంబంధించిన వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. త్వరలో మార్పులు జరిగే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల జిల్లాలో అర్హులైన జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వ పాలసీ ప్రకారం అక్రిడిటేషన్ కార్డులను అందించాల్సిందిగా కోరారు. దీనికి తోడు ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల నిబద్ధతతో ఉన్నదని ఆయన వివరించారు. ఈ సంవత్సరము తీపి కబురు చెబుతామని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ సంఘం నేతలకు హామీ ఇచ్చారని వివరించారు. ఆ ప్రకారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇంటి స్థలాలతో పాటు ఉచిత విద్య వైద్య సౌకర్యాలను కల్పించాలని, బస్సు పాస్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. దీనికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.




# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 02 (భారత శక్తి ): జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని తన చాంబర్లో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు 2026 కు సంబంధించి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి ఒకటవ తేదీ నుంచి 31 వ తేదీ వరకు జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు.రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగేలా రోజువారిగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్టీవో దుర్గాప్రసాద్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపాలిటీ ఓటర్ జాబితా సిద్ధం : మున్సిపల్ కమిషనర్ సంపత్

* 20 వార్డులు,14 వేల112 మంది ఓటర్లు



ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 2 (భారత శక్తి) : ములుగుమున్సిపాలిటీ పరిధి లోని తాజా ఓటర్ జాబితాను మున్సిపాలిటీ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి గురువారం అధికారికంగా విడుదల చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్య 14 వేల112 మందిని నమోదు చేశారు. వార్డుల వారీగా 1వ వార్డులో 6 వందల 73, 2వ వార్డులో 7 వందల 61, 3వ వార్డులో 7 వందల 54, 4వ వార్డులో 7 వందల 49, 5వ వార్డులో 6 వందల 93, 6వ వార్డులో 6 వందల 51, 7వ వార్డులో 7 వందల 26, 8వ వార్డులో 7 వందల 30, 9వ వార్డులో 6 వందల 30, 10వ వార్డులో 7 వందల 50, 11వ వార్డులో 7 వందల1, 12వ వార్డులో 7 వందల 69, 13వ వార్డులో 7 వందల 8, 14వ వార్డులో 7 వందల 89, 15వ వార్డులో 7 వందల 9, 16వ వార్డులో 6 వందల 59, 17వ వార్డులో 6 వందల 55, 18వ వార్డులో 6 వందల 48, 19వ వార్డులో 6 వందల 33, 20వ వార్డులో 7 వందల 24మంది ఓటర్లు ఉన్నారు. ఈ గణాంకాల్లో 14వ వార్డులో అత్యధికంగా 7 వందల 89 మంది ఓటర్లు ఉండగా, 9వ వార్డులో అత్యల్పంగా 6 వందల 30 మంది ఓటర్లు ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచిన ఓటర్ల జాబితాను పరిశీలించి, ఏవైనా పేర్లు చేర్పులు, తొలగింపులు లేదా సవరణలకు ఈ నెల (జనవరి) 5 లోపు అభ్యంతరాలు తెలియజేయాలని అధికారులు సూచించారు. ఈనెల 10న తుది జాబితాను ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు డివిజన్ అధికారి రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తో పాటు మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతే లక్ష్యం

* విద్యార్థులు, వాహనదారుల్లో విస్తృత అవగాహన
* రహదారి భద్రత మాసోత్సవం రెండో రోజు కార్యక్రమాలు విజయవంతం



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 02: రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, రహదారి నిబంధనలు, ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, వాహనం నడుపుతూ మొబైల్ వినియోగం చేయరాదని వంటి ముఖ్య అంశాలపై విద్యార్థులకు వివరించారు. వట్టిపల్లి మండలం మర్వెల్లి జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్, నిర్జిప్ల ప్రాథమిక పాఠశాలలో ఏఎంవీఐలు గౌతమ్ రాజ్, వెంకటేశులు విద్యార్థులు, ఉపాధ్యాయులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.కంది మండలం చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎంవీఐ శ్రీనికిత, కొర్పోల్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్, సుల్తాన్పూర్ హై స్కూల్లలో ఏఎంవీఐ చందన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా జోగిపేటలోని మైనార్టీ బాలికల మరియు బాలుర పాఠశాలలలో ఏఎంవీఐ శిరీష, సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎఎంవిఐ స్రవంతిరహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.సదాశివపేట మండల కేంద్రంలో జిల్లా రవాణా అధికారి అరుణ, ఎంవిఐ మహేష్ కుమార్ వాహనదారులకు సీట్ బెల్ట్ వినియోగం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు.రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్న వయసు నుంచే అవగాహన కల్పించడం ద్వారా సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన అధికారులు





ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 02 (భారత శక్తి):జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు, నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు నోటు పుస్తకాలు, పూల మొక్కలు, పుష్ప గుచ్చాలను అందించారు. కేకులు కట్ చేశారు. పలు శాఖల, ఉద్యోగ సంఘాలకు చెందిన డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులంతా ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచాలని పేర్కొన్నారు. కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, టిఎన్జీవో సంఘ నాయకులు, పలువురు జిల్లా మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణార్పణం జరిగితే గాని అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేపట్టరేమో?

* చిన్నపాటి వర్షా నికే గుంతలు పడుతున్న రోడ్డు -తూతూ మంత్రంగా మరమ్మత్తులు




పోరుమామిళ్ల (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు. పోరుమామిళ్ల మండలం బద్వేల్ రోడ్డులో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ నుండి. కమ్మవారిపల్లి వరకు రోడ్డు చాలా అధ్వాన పరిస్థితులు ఉందని గత నాలుగు సంవత్సరాల కాలం నుండి రోడ్డును పట్టించుకునే వారే లేరని ప్రజలు వాహనదారులు మోటార్ సైకిల్ దారులు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ వారికి ఫిర్యాదు చేయడం జరిగినది. అందులో భాగంగా ఈరోజు రోడ్డును పరిశీలించి గుంతలు పడిన రోడ్డును బాగు చేయాలని ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రతిరోజు ప్రతి దినం ఈ రోడ్డు పైన తిరుగుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు. కాంట్రాక్టర్లు వెంటనే రోడ్డు మరమ్మతులు చేయించాలని సోమవారం. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది. ప్రతిరోజు వాహనదారులు మోటార్ సైకిల్ దారులు మరియు నిత్యం క్రిందపడి దెబ్బలు తగులుతున్నాయి అయినా గాని ఎవరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని వెంటనే రోడ్డు మరమ్మత్తులు కాలయాపన చేయకుండా చేపట్టాలని సోమవారం నాడు జిల్లా కలెక్టర్ వారికి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ తరఫున ఫిర్యాదు చేయబోతున్నాం. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు, జిల్లా కన్వీనర్ డాక్టర్ బి సుజిత్ కుమార్, ఏ భాస్కర్ రెడ్డి, కానుక సురేష్ పాల్గొనడం జరిగింది.

# మూసీకి మహర్దశ.. రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం

హైదరాబాద్ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు. ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'V' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో హాల్ టిక్కెట్లు

తెలంగాణ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల హాల్ టిక్కెట్లను వారి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా పంపనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయడం ద్వారా వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే పరీక్షలకు ముందే గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, పరీక్షలకు 2 నెలల ముందే తల్లిదండ్రులకు హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయనున్నట్లు వెల్లడించారు. చాలా మంది తల్లిదండ్రుల వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాల్ టిక్కెట్‌లో ముద్రించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏమైనా తప్పులుంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు తెలియజేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. అలాగే హాల్ టిక్కెట్ నెంబర్, పరీక్ష కేంద్రం చిరునామా, ఏ రోజు ఏ పరీక్ష జరుగుతుందో తల్లిదండ్రులకు తెలియజెప్పడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

## అమరావతి నిర్మాణ పనుల్లో మరో కీలక అడుగు..

అమరావతి (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, నీరు నిల్వలు ఏర్పడకుండా ఉండేందుకు చేపడుతున్న వరద నియంత్రణ చర్యల్లో భాగంగా, ఉండవల్లి గ్రామం వద్ద 'పంపింగ్ స్టేషన్-2' నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును జోన్-8 పరిధిలో నిర్మించనున్నారు. ఈ పంపింగ్ స్టేషన్ ద్వారా వరదల సమయంలో సుమారు 8,400 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి పంపించేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ పనులకు సంబంధించిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ L1 బిడ్‌గా నిలవడంతో, ఆ సంస్థకే ప్రాజెక్టు బాధ్యతలను అప్పగిస్తూ ADCL నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.443.76 కోట్ల అంచనా వ్యయంతో ఈ పంపింగ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రాజెక్టులో భాగంగా కేవలం నిర్మాణమే కాకుండా, సర్వే, డిజైన్, అలాగే నిర్మాణం పూర్తయిన తర్వాత 15 ఏళ్ల పాటు నిర్వహణ, ఆపరేషన్ బాధ్యతలు కూడా MEIL సంస్థే చూసుకోనుంది. దీని వల్ల దీర్ఘకాలికంగా వరద నియంత్రణ వ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో సమీకరించనున్నారు. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఈ నిధులను వినియోగించనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, పనులు ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. అమరావతిలో వరద నియంత్రణకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా అధికారులు భావిస్తున్నారు. పంపింగ్ స్టేషన్-2 పూర్తయితే, వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, కృష్ణా నదిలోకి వరద నీటిని సురక్షితంగా మళ్లించేందుకు బలమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. రాజధాని నిర్మాణంలో ఇప్పటికే కొనసాగుతున్న మౌలిక వసతులకు ఈ ప్రాజెక్టు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..

హైదరాబాద్ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ORR)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీ నెంబర్ వన్ అంటూ 'ఫోర్బ్స్' కథనం...
## మంత్రి నారా లోకేశ్ స్పందన

అమరావతి (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: ప్రతిష్ఠాత్మక బిజినెస్ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రచురించిన ఓ కథనంపై ఏపీ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్ కేవలం పోటీ పడటం లేదని, అందరినీ అధిగమించి ముందుకు దూసుకెళుతోందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని 'ఫోర్బ్స్ ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికను ఉటంకిస్తూ ఓ కథనం వెలువరించింది.

**ఆ కథనం ప్రకారం...**

పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిపాదిత పెట్టుబడులలో ఏకంగా 25.3% వాటాను కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పెట్టుబడుల స్వీకరణలో ఒడిశా (13.1%), మహారాష్ట్ర (12.8%) వంటి పారిశ్రామిక రాష్ట్రాలను వెనక్కి నెట్టి ఏపీ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. భారతదేశ పారిశ్రామిక, పెట్టుబడుల గమనంలో కీలక మార్పు చోటుచేసుకుంటోందని, వృద్ధి ఇప్పుడు తూర్పు, దక్షిణ రాష్ట్రాల వైపు మళ్లుతోందని ఈ నివేదిక సూచిస్తోంది. నివేదిక ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ప్రతిపాదనకు వచ్చాయి. ఇది గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 11.5% అధికం. ఇందులో సింహభాగం, అంటే 51.2% పెట్టుబడులు కేవలం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలోనే కేంద్రీకృతమయ్యాయి. ఈ మూడింటిలోనూ ఏపీ తిరుగులేని ఆధిపత్యంతో మొదటి స్థానంలో నిలవడం విశేషం.

**లోకేశ్ ఏమన్నారంటే...!**

ఈ అద్భుతమైన విజయంపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఇతరులను అందుకోవడం లేదు, వారిని దాటి ముందుకు దూసుకుపోతోంది. స్థిరమైన సంస్కరణలు, నిర్ణయాలు తీసుకోవడంలో వేగం, పెట్టుబడిదారులకు స్పష్టమైన భరోసా ఇవ్వడం వల్లే ఈ అసాధారణ ఫలితం సాధ్యమైంది. పారదర్శకమైన విధానాలతో కూడిన వాతావరణాన్ని సృష్టించడం, పరిశ్రమలకు పెద్దపీట వేయడం, చెప్పిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపైనే మా ప్రభుత్వం దృష్టి సారించింది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారుల స్నేహపూర్వక పాలన, అనుమతులలో వేగం, రంగాల వారీగా ప్రత్యేక విధానాలు, మౌలిక సదుపాయాలపై భారీగా దృష్టి పెట్టడమే ఈ విజయానికి కారణమని ప్రభుత్వం విశ్లేషిస్తోంది. ముఖ్యంగా ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధన, డిజిటల్ రంగాలలో మౌలిక వసతులను బలోపేతం చేయడం కలిసొచ్చింది. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో ప్రభుత్వం నిరంతరం జరుపుతున్న చర్చలు, స్థిరమైన విధానాలు, వేగవంతమైన పాలన కారణంగా తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల రంగాలలో భారీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. "వచ్చే ప్రతి పెట్టుబడి క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీలు, ఉద్యోగాలు, మన ప్రజలకు ఆర్థిక అవకాశాలుగా మారాలి. పెట్టుబడిదారులతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను నిర్మించడం, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం కొనసాగిస్తాం" అని నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ ప్రదర్శనతో, భారతదేశ తదుపరి పారిశ్రామిక వృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఒక కీలక చోదకశక్తిగా, పోటీతత్వ పాలనకు ఒక ప్రమాణికంగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

## తిరుమలలో భక్తుల కోసం టీటీడీ సరికొత్త ఆలోచన

తిరుమల (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో వైకుంఠ ద్వార దర్శనాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవిందనామ స్మరణతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు కేవలం మూడు రోజుల్లోనే దాదాపు 33 వేల వాహనాలు తిరుమలకు చేరుకోగా, సుమారు 1,77,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం కూడా రికార్డు స్థాయిలో నమోదైంది. డిసెంబర్ 30న రూ. 2.25 కోట్లు రాగా, 31న ఏకంగా రూ. 4.79 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తుల దాహార్తిని తీర్చేందుకు టీటీడీ ఓ వినూత్న ఆలోచనను అమలు చేసింది. ఎండలో అలసిపోయే భక్తులకు తక్షణమే నీరు అందించేలా శ్రీవారి సేవకులు వీపుకు వాటర్ క్యాన్లను తగిలించుకుని గ్లాసులతో నీటిని అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులకు ఈ సేవ ఎంతో ఊరటనిస్తోంది. ఈ కొత్త విధానంపై భక్తుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులను కూడా సర్వదర్శనానికి అనుమతిస్తున్నారు. ఆక్టోపస్ భవనం, నారాయణగిరి ఉద్యానవనం మీదుగా క్యూలైన్లను క్రమబద్ధీకరించి, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 ద్వారా భక్తులను లోపలికి పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా... చెన్నైకి చెందిన పొన్నయ నాగేశ్వరన్ అనే భక్తుడు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన డీడీని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆయన అందజేశారు.

## తెలంగాణ శాసనసభలో గందరగోళం..
## హరీశ్ రావు సూచనను తిరస్కరించిన స్పీకర్



తెలంగాణ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల రెండో రోజు తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతోంది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత అంశంపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అసెంబ్లీలో పెద్ద ఎత్తున నిరసనకు దిగింది. ఈ ఉదయం సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ హాల్‌లోకి వచ్చారు. "కాంగ్రెస్ వచ్చింది.. రైతులను నిండా ముంచింది" అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై వారు తీవ్ర విమర్శలు గుప్పించారు. వ్యవసాయ సీజన్ కీలక దశలో ఉన్నప్పటికీ రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. యూరియా కొరతపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి సభను సాధారణ కార్యక్రమాలతో కొనసాగించడం సరికాదని వారు స్పష్టం చేశారు. అయితే ప్రతిపక్షాల నిరసనపై శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్ష సభ్యులకు ప్రశ్నోత్తరాల సమయం జరగడం ఇష్టం లేనట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సమస్యలుంటే సభలో సరైన పద్ధతుల్లో చర్చకు రావాలని, కానీ ఇలా నినాదాలు చేస్తూ సభా సమయాన్ని వృథా చేయడం సరైంది కాదని మంత్రి సూచించారు. ఈ క్రమంలో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు యూరియా అంశంపై పాయింట్ ఆఫ్ ఆర్డర్ కోరారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దానికి అనుమతి నిరాకరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు అవకాశం లేదని బీఆర్ఎస్ నేత హరీశ్ రావుకు తేల్చి చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకుండా తమ నిరసనను కొనసాగించడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. రైతులకు యూరియా సరఫరా అంశంపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షం కావాలనే సభను అడ్డుకుంటోందని కౌంటర్ ఇస్తోంది. ఈ పరిణామాలతో శాసనసభలో ప్రభుత్వం-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమయ్యింది.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ..

హైదరాబాద్ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 02: ఇప్పటికే అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. గత కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్‌కౌంటర్లు, నేతల ఆరోగ్య సమస్యలు, అంతర్గత గ్రూపు సమస్యలు ఇప్పటికే పార్టీని బలహీనపరిచాయి. ఈ సంక్షోభంలో మరో కీలక మావోయిస్టు నేత బర్సే దేవా ఈ రోజు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. బర్సే దేవా మావోయిస్టు గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తూ, పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న నేత. ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హిడ్మా మరణించిన తర్వాత, పార్టీకి అవసరమైన ఆయుధాలు, వ్యూహాలు, రక్షణ కార్యకలాపాలన్నింటిని బర్సే దేవా చూసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. బర్సే దేవా, హిడ్మా ఒకే గ్రామానికి చెందినవారని, దీంతో మావోయిస్టు పార్టీలో ఆయన పాత్ర మరింత కీలకమని విశ్లేషకులు చెబుతున్నారు. పోలీసులకి లొంగిన తర్వాత, బర్సే దేవా దగ్గర మౌంటెన్ ఎల్ఎంజీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన పర్యవేక్షించిన మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యులు కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామంతో, మావోయిస్టు పార్టీకి కీలకంగా నిలిచిన నాయకత్వ వ్యవస్థలో పెద్ద గ్యాప్ ఏర్పడింది. రేపు బర్సే దేవాను మీడియా ముందు ఉంచి, ఆయన లొంగిపోవడంలో వచ్చే ప్రాముఖ్యత, స్వాధీనం చేసిన ఆయుధాల వివరాలు, మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యుల గురించి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా వివరించనున్నారు. ఈ సంఘటన తెలంగాణలోని మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. గతంలో, అనేక మంది కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, ఆరోగ్య సమస్యలు, పార్టీ అంతర్గత విభజనలు వంటి కారణాలతో ఇప్పటికే ఎంతోమంది సరెండర్ అయ్యారు. తాజాగా బర్సే దేవా కూడా పోలీసుల ఎదుట లొంగిపోయిన తరువాత, పార్టీ వ్యూహాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టు ఉద్యమం ఇప్పటి వరకు చూసుకున్న వ్యూహాలను సరిచూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

# ఓక్‌ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు జాతీయ రోడ్డు భద్రతా అవగాహన




ఎల్బీనగర్, జనవరి 02 (భారత శక్తి): చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యానగర్‌లోని ఓక్‌ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ ఎ.కృష్ణయ్య, ఓక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ శారద, స్కూల్ ప్రిన్సిపల్ శిరీష, చైతన్యపురి సీఐ కె. సైదులు, సెక్టార్ ఎస్ఐ పి. భద్రయ్య, రోడ్డు భద్రతా ఎస్ఐ జగన్ లు మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, స్కూల్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు. పాల్గొన్నవారికి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, హెల్మెట్లు, సీట్ బెల్ట్స్ ధరించడం, పాదచారులు దాటడం నియమాలు, అశాంతిగా డ్రైవింగ్ చేయకుండా ప్రమాదాలను నివారించడం వంటి ముఖ్యమైన రోడ్డు భద్రతా పద్ధతులపై వివరణాత్మక సూచనలు ఇచ్చారు. గ్రీన్, ఎల్లో రెడ్ రంగుల ప్రాముఖ్యత వంటి తెలియజేశారు. ఎవరైనా ప్రమాదం జరిగినప్పుడు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి, వారి ప్రాణం కాపాడే సమయంలో సాయం చేసిన వారికి 25 వేల ప్రభుత్వం నుంచి పారితోషికం అందజేస్తారని చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించి, సమాజంలో మంచి రోడ్డు అలవాట్లను పెంపొందించే ఈ కార్యక్రమం చైతన్యపురి పోలీస్ స్టేషన్ ప్రజా భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు కట్టుబడి ఉందని తెలిపింది.




## ఎల్బీనగర్ సిఐ వినోద్ కుమార్‌కు రాక్‌టౌన్ కాలనీ వాసుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎల్బీనగర్, జనవరి 02 (భారత శక్తి) : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాక్‌టౌన్ కాలనీ సొసైటీ సభ్యులు శుక్రవారం ఎల్బీనగర్ సిఐ వినోద్ కుమార్, సెక్టార్ ఎస్ఐ ప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో భద్రతకు సంబంధించిన పలు అంశాలను సిఐ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని, పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. అలాగే, కాలనీతో సంబంధం లేని వ్యక్తులు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తున్నారని, దీనివల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. అటువంటి వాహనాలపై చర్యలు తీసుకుని, పార్కింగ్‌ను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

**సానుకూలంగా స్పందించిన పోలీసులు:**

కాలనీ సభ్యుల విన్నపంపై సిఐ వినోద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతరం గస్తీ ఉండేలా చూస్తామని, ప్రజల భద్రతకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనవసర పార్కింగ్ విషయమై తగిన ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాక్‌టౌన్ కాలనీ ప్రెసిడెంట్ ఎర్ర వినోద్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు మణిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, సంపత్ కుమార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, బాల్ రెడ్డి, సుదర్శన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## వరద నాలా విస్తరణ పనులను బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరిశీలన



ఎల్బీనగర్, జనవరి 02 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో పి&టీ కాలనీ ఎస్.జి.ఆర్ టవర్స్ నుండి న్యూ గడ్డిఅన్నారం వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు జరుగుతున్న వరద నాలా విస్తరణ పనులను శుక్రవారం ఉదయం గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, న్యూ గడ్డిఅన్నారం, పి&టీ కాలనీ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే వరద ముంపు సమస్య తీవ్రంగా ఎదురవుతున్నదని, ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జీహెచ్ఎంసి ద్వారా దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో సుమారు 1 కోటి రూపాయలతో ప్రధాన వరద కాలువ నిర్మాణం పూర్తయింది.. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా 93 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న వరద నాలా విస్తరణ పనులు పూర్తయితే ఈ ప్రాంతాలకు పూర్తిస్థాయి నీరు నిల్వ/ముంపు సమస్య తొలగిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పనులు నాణ్యతతో, ప్రమాణాలకు అనుగుణంగా, కాలపరిమితిలో పూర్తి చేయాలని స్పష్టంగా ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, న్యూ గడ్డిఅన్నారం కాలనీ అధ్యక్షులు రఘు, పి&టీ కాలనీ వాసులు శేఖర్, సత్యం, రఘు మరియు బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, వంశీ యాదవ్, టీంకు, గిరీష్, పవన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు 'జాగృతి' జిల్లా అధ్యక్షుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

*** జాగృతి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం:కప్పాటి పాండురంగా రెడ్డి**

హైదరాబాద్, జనవరి 02 (భారత శక్తి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు శుక్రవారం పలు జిల్లాల జాగృతి అధ్యక్షులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

**పుష్పగుచ్ఛాలతో స్వాగతం:**

తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్, మరియు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి కవితక్కను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు తీసుకున్నారు.

**జాగృతి బలోపేతమే లక్ష్యం:**

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి సంస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తులో చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణం గురించి కవితకు క్లుప్తంగా వివరించారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా, ప్రజల పక్షాన నిలబడి జాగృతి తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన




పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు బాబురావు, చీమల రమేశ్, చదలవాడ విష్ణుమూర్తి మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జి.హెచ్.ఎం.సి ,మహా నగరం.. సవాళ్ల సంద్రం!

*** 27 మున్సిపాలిటీల విలీనంతో 'గ్రేటర్' విస్తరణ.. కానీ నిధులు, నియామకాల్లో నిమ్మకు నీరెత్తిన చందమే!**

*** వారసత్వ సమస్యలతో సతమతమవుతున్న పాలన.. సిబ్బంది కొరతతో కునారిల్లుతున్న సేవలు.**

*** (పరిశోధనాత్మక పాత్రికేయం మీ.. "వీ. జీ" (ఎం వేణుగోపాల్ రెడ్డి)**

హైదరాబాద్, జనవరి 02 (భారత శక్తి): భాగ్యనగరం 'విశ్వనగరం'గా రూపాంతరం చెందుతోంది. చుట్టుపక్కల ఉన్న 27 మున్సిపాలిటీలను తనలో విలీనం చేసుకుని, భౌగోళికంగా జిహెచ్ఎంసి ఒక భారీ మహా నగరంగా అవతరించింది. అయితే, విస్తీర్ణం పెరిగినంత వేగంగా పౌర సేవలు విస్తరించడం లేదన్నది నగ్న సత్యం. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఐటీ హబ్‌గా పేరుగాంచిన ఈ మహానగరం, లోపల మాత్రం 'సిబ్బంది కొరత' మరియు 'నిధుల లేమి' అనే దీర్ఘకాలిక వ్యాధులతో కొట్టుమిట్టాడుతోంది.




**విస్తరణ సరే.. నిర్వహణేది?**

గతంలో కేవలం కోర్ సిటీకి పరిమితమైన కార్పొరేషన్, ఇప్పుడు శివార్లలోని మున్సిపాలిటీలను కలుపుకుని దాదాపు 650 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించింది. జనాభా కోటికి చేరువైంది.

* మౌలిక సదుపాయాల కొరత: విలీనమైన ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.

* వారసత్వ సమస్యలు: విలీన మున్సిపాలిటీల నుంచి వచ్చిన అప్పులు, అసంపూర్తి పనులు ఇప్పుడు GHMC కి గుదిబండగా మారాయి.

*** సిబ్బంది కొరత: ఒకే భుజంపై పది భారాలు!**

* నగరం పెరిగినా, దానికి తగ్గట్టుగా మంజూరైన పోస్టుల భర్తీ జరగకపోవడం ఆందోళనకరం.

* కీలక విభాగాల్లో ఖాళీలు: టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో 30% నుంచి 40% వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

* ఒత్తిడిలో అధికారులు: ఒక్కో ఏఈ నాలుగైదు డివిజన్ల పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీనివల్ల పనుల నాణ్యత తగ్గడమే కాకుండా, పౌర ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది.







* ఔట్ సోర్సింగ్ భరోసా లేకపోవడం: క్షేత్రస్థాయిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు సరైన భద్రత, వేతనాలు అందక పోవడంతో నగరం అప్పుడప్పుడు చెత్త కుప్పగా మారుతోంది.

*** రాబోయే కష్టనష్టాలు - ప్రమాద గంటికలు..!**

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది:

* వరద ముప్పు: సరైన ఇంజనీరింగ్ పర్యవేక్షణ లేకపోతే, అక్రమ కట్టడాలు పెరిగి వర్షాకాలంలో నగరం జలదిగ్బంధం కాక తప్పదు.

* అక్రమ నిర్మాణాలు: టౌన్ ప్లానింగ్ సిబ్బంది తక్కువగా ఉండటంతో అనుమతులు లేని వెంచర్లు, అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి.

* ఆరోగ్య అత్యవసరాలు: పారిశుద్ధ్యం కుంటుపడితే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

*** పరిష్కార మార్గాలు: మేలుకోకపోతే మునిగిపోతాం!**

* ప్రభుత్వం మరియు జి.హెచ్.ఎం.సి పాలకమండలి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

* కొత్త నియామకాలు: పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త పోస్టులను మంజూరు చేసి, వెంటనే భర్తీ చేయాలి.

* వార్డు పాలన బలోపేతం: పరిపాలన వికేంద్రీకరణ జరగాలి. ప్రతి వార్డుకు ప్రత్యేక బడ్జెట్ మరియు నిర్ణయాధికారం ఉండాలి.

* డిజిటలైజేషన్: సిబ్బంది తక్కువగా ఉన్నప్పుడు టెక్నాలజీని వాడుకోవాలి. ఆస్తి పన్ను వసూళ్ల నుంచి భవన నిర్మాణ అనుమతుల దాకా పారదర్శకమైన ఆన్‌లైన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి.

* ఆర్థిక స్వయంప్రతిపత్తి: కేవలం ప్రభుత్వ గ్రాంట్ల మీద ఆధారపడకుండా, సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలి.

**ముగింపు:**

హైదరాబాద్ కేవలం భవనాల సముదాయం కాదు, కోట్లాది మంది కలల నగరం. ఈ నగరాన్ని 'మహా' నగరంగా మార్చడం అంటే కేవలం సరిహద్దులు పెంచడం కాదు, పౌరుల జీవన ప్రమాణాలను పెంచడం. సిబ్బంది కొరతను అధిగమించి, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వైపు అడుగులు వేయకపోతే 'గ్రేటర్' అన్న పేరు బోర్డులకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరిన్ని ఆధారాలతో తదుపరి కథనంలో...

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.